ప్రజాశక్తి ఆదివారం అనుబంధం
నవంబర్ 12, 2006
వనం... జనం... కలిసుంటేనే వికాసం

హ్యాపీ బర్త్‌డే

(12.11.2006 నుండి 18.11.2006 వరకు)



చరిష్మాశ్రీజ
3సం॥, నవంబర్-13
రోజారాణి-విమల్‌శంకర్
అరిలోవ-విశాఖపట్నం



డి. దేవహర్షిణి
1సం॥, నవంబర్-13
ప్రమీల-రెడ్డి నర్సింహులు
సోమల-చిత్తూరు

జి. ప్రణతి
1సం॥, నవంబర్-13
ఎలియా-నైజిమ్
మెదికొండ-మ॥నగర్



ఎన్.సి. నందన
నవంబర్-16
కరుణశ్రీ-శేషు
ఆదిలాబాద్

ఎం. సంజయ్
1సం॥, నవంబర్-17
శ్రీలత-సోమేశ్వరాచారి
మహబూబ్‌బాద్-వరంగల్

సి. కార్తిక్
2సం॥, నవంబర్-17
స్వరూప-నర్సింలు
జహీరాబాద్-మెదక్

ఇ. సౌమ్య
3సం॥, నవంబర్-2003
మంగ-భూపాల్
ఇబ్రహీంపట్నం-రంగారెడ్డి

వై. గౌతమి
5 సం॥, నవంబర్-2001
సరస్వతి-చిన్నబాలయ్య
ఇబ్రహీంపట్నం-రంగారెడ్డి

ఎం. యువశ్రీ
3సం॥, నవంబర్-2003
శ్యామల-శివప్రసాద్
రాజమండ్రి-తూ॥గో॥

సిహెచ్. నిర్మల్ కుమార్
1సం॥, నవంబర్-2005
ఉష-హరిబాబు
బాణాపురం-ఖమ్మం

ఇ. ఎజ్రా(బన్ని)
1సం॥, నవంబర్-2005
ఝాన్సీలక్ష్మీబాయి-చినబాబు
జంబూపట్నం-తూ॥గో॥

ఎం. చరిష్మా
1సం॥, నవంబర్-17
అరుణ-ప్రవీణ్
ఖమ్మం



కళలద్వారా విలువల్ని కాపాడుకుందాం

మన అతిథి గురించి...

పేరు	:	బండి రాజన్‌బాబు
జననం	:	**9.2.1939**, కోరుట్ల, కరీంనగర్ జిల్లా
వృత్తి	:	ఫొటోగ్రఫీ
ప్రత్యేకత	:	ఫెలోషిప్ ఆఫ్ రాయల్ ఫొటోగ్రఫిక్ సొసైటీ (ఎఫ్ఆర్‌పిఎస్) పొందిన ఏకైక ఆంధ్రుడు.
అవార్డులు	:	ఆర్టిస్ట్ ఫెడరేషన్ ఇంటర్నేషనల్ డి ఐ'ఆర్ట్ ఫొటోగ్రఫీ (ఎఎఫ్ఐఎపి), అసోసియేషన్ ఆఫ్ రాయల్ ఫొటోగ్రఫిక్ సొసైటీ (ఎఆర్‌పిఎస్), ఎఫ్ఆర్‌పిఎస్, ఆనరరీ ఫెలోషిప్ ఆఫ్ ఎపి స్టేట్ అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీ, సర్వీస్ ఆనర్ – అసోసియేట్ ఆఫ్ ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫిక్ కౌన్సిల్.
లక్ష్యం	:	కళాసేవ
బలం	:	ధైర్యం, లక్ష్యసాధన
బలహీనత	:	అందర్నీ నమ్మడం.

విలువలు డబ్బు చుట్టూనే వున్నాయి. ప్రపంచం దాని చుట్టూనే తిరుగుతోంది. ప్రతిభతో ఉద్యోగం సంపాదించే రోజులు పోయాయి. డబ్బుంటేనే అది దొరుకుతుంది. పాలకుల మాటల్లో లాజిక్కులు తప్ప లా ఉండడం లేదు. పాశ్చాత్య సంస్కృతితో యువత చెడిపోతోంది. ఫ్యాషన్ డిజైనింగ్ పాడుచేస్తోంది. సినీ మాయ, టీవీంద్రజాలాలు పక్కదోవ పట్టిస్తున్నాయి. నేరం చేసే తీరును ఛానళ్లలో కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నారు. ఇది అవసరమా? ఇది చాలా ప్రమాదకరమైంది? చిన్నప్పటి నుండే తల్లిదండ్రులు, గురువులు పిల్లల్లో నైతిక విలువల పట్ల అవగాహన కల్పించాలి. కళలు సమాజాన్ని మారుస్తాయి. అంతరించిపోతోన్న మానవవిలువల్ని కళలద్వారా కాపాడుకుందాం.

ఈ సంచికలో...

టపా ... 2
సెన్సూ కామన్ సెన్సు ... 4
సలహాలు ... 5
ఇంటి సంగతులు ... 6
క్యాంపస్ ఛాట్ 10
సినిమా కబుర్లు ... 11
బాలనేస్తాలు ... 12
అట్టమీది కథ ... 14

ఇంకా...

ఇలా వుందామా... 7
సత్సంబంధాలు

సీరియల్ 8
తెలుగుగడ్డ

కథ 18
జననం

అవీ...ఇవీ ... 20
ఓ మంచి పుస్తకం ... 21
మనసా... తెలుసా ... 22
విజ్ఞానవీచిక ... 23
కొత్త పుస్తకాలు ... 24

డిజిటల్ ప్రపంచం...

'అట్టమీద కథ'లో రీళ్లు లేని సినిమా గురించి చదివి ఆశ్చర్యపోయాం. ఈ డిజిటల్ ప్రపంచంలో ముందు ముందు ఇంకెన్ని వింతలు, విశేషాలు రానున్నాయో...?! మనసు పలికే మౌనరాగమే స్నేహమయితే... మదిని వలచే ప్రేమరాగమే ఈ మా స్నేహ.

భాగ్యరాజ్, పొన్కల్



ఒత్తిడి ప్రభావం

స్నేహ 29.10.2006 నాటి సంచికలో అట్టమీదికథ 'రీళ్లులేని సినిమా' ద్వారా డిజిటల్ సినిమా గురించి రాసి ఎన్నో కొత్త సంగతులు తెలుసుకునే అవకాశం కలుగజేశారు. సైన్స్ సాధించే అద్భుత విజయాలకు ఇలాంటివి నిలువెత్తు నిదర్శనంగా, ఆలంబనగా నిలుస్తున్నాయి. ఆరోగ్యంపై ఒత్తిడి ప్రభావం ఖచ్చితంగా ఉంటుందని డా॥ హరిహర్‌గారి ద్వారా తెలుసుకున్నాం. మారని గోదావరి కథ హృద్యంగా ఉంది. ఈ వారం అతిథి చందనాచక్రవర్తిగారి 'ప్రతి ఒక్కరూ పోడాల్సి ఉంది' అనే ఉవాచ అనుసరణీయమైనది. కార్టూన్లు అడుగడుగునా నవ్వులపువ్వులను రివ్వుమనిపిస్తూ, మరోపక్క సామాజిక వాస్తవాలను సుతిమెత్తగా తెలియజేస్తూ ఆలోచింపజేస్తున్నాయి. హాస్యపు చురకలతో కవ్వించే అసలయిన కార్టునిస్టు లక్షణం ఉన్న హరిగారిని మనసారా అభినందిస్తున్నాం. వారు మరింతగా ఈ రంగంలో ఎదిగి ప్రసిద్ధి చెందాలని అభిలషిస్తున్నాం.

నేమాన సుభాష్‌చంద్రబోస్, ఇలిసిపురం, శ్రీకాకుళం.

చక్కటి వ్యాసం

ప్రపంచీకరణ నేపథ్యంలోనూ ముందుండాలన్న చందనా చక్రవర్తిగారి ముందుచూపు ప్రశంసనీయం. కొసరాజుగారి రైతు తత్వ వైశిష్ట్యాన్ని, సంగీతవైభవాన్ని తెలియజేసిన చక్కటి వ్యాసం అందించారు. రీళ్లు లేని సినిమా కథ బాగుంది. అవీ ఇవీ అన్నీ బాగున్నాయి. పుస్తక సమీక్ష, హాపీబర్త్‌డే శీర్షికలు ఆకట్టుకున్నాయి.

వాస్తురామచంద్ర, రామ్‌జీ నగర్, నెల్లూరు.

ఆలోచింపజేసింది

రుక్మిణిగారి కలంనుంచి వెలువడిన 'పాకెట్ మనీ' మమ్మల్నెంతగానో ఆలోచింపజేసింది. నేటి సమాజంలోని వాస్తవాలను చక్కగా విశ్లేషించిన తీరు ప్రశంసనీయం. అలాగే 'అవీ...ఇవీ' శీర్షికలోని జోక్స్, కార్టూన్లు, కవిత సంతోషాన్నిచ్చాయి.

దండెం రాజయ్య, డోర్నకల్, వరంగల్ (జిల్లా)

ఆసక్తికరంగా

స్నేహలో న్యాయసలహాలు శీర్షికతో అందిస్తోన్న సందేహాలకు సమాధానాలు మాకెంతో ఉపయోగపడుతున్నాయి. అందుకు ధన్యవాదాలు. మనమూ మననమ్మకాలంటూ మూఢ నమ్మకాలను పారద్రోలే ప్రయత్నం ప్రశంసనీయం.

కె. తిరుపతిరెడ్డి, కె త్రివేణిరెడ్డి, ఆదిలాబాద్.

పాకెట్ మనీ...

'సెన్సూ కామన్ సెన్సు' శీర్షికలో పాకెట్‌మనీ గురించి రాసిన తీరు బాగుంది. 'ఇంటి సంగతులు'లో తల్లులు తమ పిల్లల్ని ఎలా పెంచాలో అరటిపండు వలిచి చేతికందించినట్లు చెప్పారు. 'తెలుగు గడ్డ' సీరియల్ బాగుంటోంది. ఇలా ఉందామా, క్యాంపస్‌ఛాట్ తదితర శీర్షికలన్నీ బాగున్నాయి.

కె. సరిత, కాకినాడ

పజిల్స్ ప్రవేశపెట్టండి

29.10.2006 సంచిక ప్రజాశక్తి ఆదివారం అనుబంధం మనోహరంగా ఉంది. హరి వెంకటరమణగారి కథ 'మారని గోదావరి' ఆసక్తికరంగా ఉంది. కథ చదువుతూంటే మేం పుట్టినూరు, బాల్యవిషయాలు జ్ఞాపకం వచ్చాయి. గత కాలపు స్మృతులు అందరికీ మధురంగానే ఉంటాయి. ఎందుకంటే ఆ రోజులు మరల తిరిగిరావు గనుక. యాంత్రిక జీవితంతో సతమతమౌతున్నవారికి ఇలాంటి కథలు కాస్త ఉపశమనం కలిగిస్తాయని చెప్పడం అతిశయోక్తికాదు. కథారచయితకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. 'ఇంటిసంగతులు'లో పిల్లలను పెంచే తల్లులు గమనించాల్సిన విషయాలున్నాయి. సినిమా కబుర్లలో కొసరాజు రాఘవయ్య చౌదరిగారి విశిష్టతను తెలుసుకున్నాం. 'పాకెట్‌మనీ' కథనం మధ్యతరగతి కుటుంబ పరిస్థితికి దర్పణం అని చెప్పవచ్చు. పాఠకుల ప్రశ్నలకు జవాబులు, పజిల్స్ (సాహిత్యానికి సంబంధించినవి) ప్రవేశపెడితే బాగుంటుందని నా అభిప్రాయం.

కలువకోట మురళీధరస్వామి, కృష్ణానగర్, జగిత్యాల, కరీంనగర్ జిల్లా.

రూ.510/-ల ఇంగ్లీష్ కోర్సు రూ.150/-కే

లేటెస్ట్ టెక్నాలజీ సహాయంతో



మొత్తం మూడు డివిజన్ల ప్రత్యేక ఇంగ్లీష్ కోర్స్

డివిజన్-1	డివిజన్-2	డివిజన్-3	రూ.
రూ.130/-	రూ.170/-	రూ.210/-	510/-

రూ. 150/-కే

ఇవన్నీ!

డివిజన్-1 ABCD ల నుంచి ఇంగ్లీష్ చదవటం, రాయటం, నేర్పుతూ, ప్రతి ఒక్కరికీ కావలసిన స్థాయిలో స్టాండర్డ్ ఇంగ్లీష్ నేర్పబడుతుంది. ఈ కోర్స్ ఫీజు రూ.130/-

డివిజన్-2 తప్పులు లేకుండా ఇంగ్లీషు రాయుటకు కావలసిన ఆంగ్ల వ్యాకరణం పరిపూర్ణంగా సులభ సూత్రాలతో చాలా ఈజీగా నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.170/-

డివిజన్-3 ఎంతో సులభంగా, ఏ సందర్భంలోనైనా తడబడకుండా, తప్పులు లేకుండా, మంచి నీళ్ళు త్రాగుతున్నట్లుగా మంచి ఇంగ్లీషు మాట్లాడటం నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.210/-

ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!...

నేను ఒకసారి రైలులో ప్రయాణిస్తున్నాను. నా ప్రక్కసీటులోని వ్యక్తి స్టూడెంట్స్ ఇంగ్లీష్ ఇన్‌స్టిట్యూట్ వారి పుస్తకాలు చదువుతున్నాడు. నేనూ టైంపాస్ కొరకు ఒక బుక్ తీసుకొని చదివాను. అంతే! నాకు ఆశ్చర్యంవేసింది. "ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!..." అనిపించింది. నేనూ పుస్తకాలు తెప్పించుకుని చదివి ప్రస్తుతం నేను చక్కగా ఇంగ్లీష్‌లో మాట్లాడుతున్నాను.

- కె.కమలాకరరావు, విజయవాడ.

ఇదొక డిఫరెంట్ కోర్స్!

డిగ్రీవరకు చదివిన నేను ఇంగ్లీష్‌లో మాట్లాడలేకపోయేవాడిని, నా మిత్రుని వద్ద ఈకోర్స్ బుక్స్ చూశాను. ఇంగ్లీష్ ఫ్లూయెన్సీకి కరక్ట్‌గా ఉపయోగపడే బుక్స్ యివి. 'ఇదొక డిఫరెంట్ కోర్స్' అని నాకు అనిపించింది.

- వి.కె. రాజు, రాజమండ్రి.

కోర్స్ అద్భుతంగా ఉంది!

అవును! ఈ ఇంగ్లీష్ కోర్స్ చాలా అద్భుతంగావుంది. ఎందుకంటే, బాగా చదివినవారికే కాక, కొద్దిగా చదువుకున్న వారికి కూడా అర్థమయ్యేరీతిలో చెప్పిన విధానం చాలా బాగుంది.

- కె.సురేష్, హైదరాబాద్.

ఎక్కడా చూడలేదు

నేను డిగ్రీ వరకూ చదివాను. అయినా ఇంగ్లీష్ మాట్లాడలేక పోయేవాడిని. సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోండి అని ప్రకటన చూసి కోర్స్ కొన్నాను. నిజానికి నేను ఇలాంటి కోర్స్ బుక్స్ ఎక్కడా చూడలేదు.

- వై.చంద్రశేఖర్, విశాఖపట్నం.

సులభంగా వుంది

చాలా పుస్తకాలు చూశాను. ఇంగ్లీష్ నేర్పే విధానం ఆ పుస్తకాల్లో అర్థమయ్యేది కాదు నాకు, ఈ కోర్స్ కొని చదువుతుంటే, ఇంగ్లీష్ ఇంత సులభమా అనిపించేంతగా వుంది. చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకొన్నాను.

- జె.శ్రీనివాసులు, తిరుపతి.

STUDENTS' ENGLISH INSTITUTE

POST BAG NO.8569, New No. 203, Habibullah Road, (Near: KodambakkamRly. Stn;) T.Nagar, Chennai - 17.

నాకు ప్రస్తుతం రూ.510/-లు విలువగలిగిన ఇంగ్లీష్ కోర్సు కేవలం రూ.150/-లకే వి.పి.పి. ద్వారా పంపించండి. పోస్ట్‌మేన్‌కి పైకం చెల్లించి ప్యాకెట్‌ని తీసుకుంటానని హామీ ఇస్తున్నాను.

3912

Name: ....

Address: ....

....

....

....

.... Pincode

సెన్సూ కామన్ సెన్సు

రుక్మిణి

"పరుల కోసం...!"

'పరులకోసం పాటుపడనీ నరుని బతుకూ ఎందుకూ...' ఈ కవిత నిజంగా చాలా బావుంటుంది. ఇతరుల శ్రేయస్సూ, క్షేమాలను కోరడం మానవ విలువల్లో ఎంతో ఉన్నతమైన భావన. అసలు 'వసుధైక కుటుంబాలు' అనే భావనే చాలా మధురమైనది.

అంతవరకూ బాగానేవుంది. కానీ నా శ్రీమతి భాను మొత్తానికి మొత్తం ఈ భావననే పరమానందంగా భావించి బతికేస్తుండడం నా మెడకో ఉరితాడయింది. అది కాస్త వదులై... మళ్ళీ ...బిగుసుకుపోతుండం నేను విలవిల్లాడుస్తూ బాధ పడడం అలవాటైపోయింది. ఆ ఆదివారం స్వల్పవ్యవధిలో నా నడుం కాస్తా పుటుక్కున విరిగి నేను శాశ్వతంగా మంచాన పడుండే బాధ తప్పింది. అది ఎటులనిన.

శ్రీమతి భానుగారు ప్రతిరోజూ ఇల్లు మొత్తం నీళ్ళు జల్లి తుడవందే పచ్చి కాఫీకూడా ముట్టదు. తాను బాగా ఇష్టపడి కట్టుకున్న ఇల్లాయె. నేల మీద ఆకర్షణీయంగా వుండాలని రంగురంగుల 'కజారియా' టైల్స్ పరిపించాం. అవి మహా నునుపూ, సున్నితమూను. ఆవిడ పోసిన తడి ఆరకముందే ఫోను రింగైతే హడావుడిపడుతూ, హాల్లోంచి గబగబా లోనికి ఉరికా. సర్రున జారి రెండు గజాల దూరం పోయి నిలదొక్కుతున్నా, నా ఒళ్లు మండిపోయింది. "ఏమే ఇదేం పని? రోజూ కడుగుడేనా? వారానికోసారి కడిగితే సరిపోదా?" అని కేకలేశాను.

"ష్.. అరవకండి.. ఇంటికి చాలామంది వస్తూపోతూ వుంటారు. రోజూ కడక్కపోతే ఏం బాగుంటుంది? వాళ్ళేమనుకుంటారు?" అందావిడ.

నేను నోరెళ్ళబెట్టాను. నా ఇంటి కదుగుడికీ వాళ్ళకీ ఏం సంబంధం?! రేపు నా నడుం విరిగితే వాళ్ళదేనా భాద్యత? ఇదేం ఆలోచన?

మరో రోజు –

"ఏవండోయ్.... అర్జంటుగా అయిదు వేలిచ్చుకోండి!" అని భాను హుకుం జారీచేయడంతో నేను దద్దరిల్లిపోయాను.

"అయిదువేలా? ఎక్కడివీ? ఎందుకూ?"

"రేపు మా స్నేహితురాలి తమ్ముడి మ్యారేజుంది. మీరు ఆఫీసుకు పోయినపుడు అది స్వయంగా వచ్చి, తప్పక వస్తానని ఒట్టేయించుకుని మరీ పోయింది. మిమ్మల్ని కూడా సెలవుపెట్టించి తప్పకుండా తీసుకు రమ్మంది" భాను కళ్ళు చక్రాల్లా తిప్పుతూ చెప్పింది.

"సరే... సుబ్బరంగా పెళ్ళికెళ్ళు... దానికి డబ్బెందుకే?" ఆసక్తిగా అడిగాను.

"అరతులం బంగారం ఎంత? అయిదువేలుగదా? మంచి రింగు చేయించి పిల్లాడికి ప్రెజెంటు చేయద్దూ?" జడ విసురుతూ అంది.

నేను నోరెళ్ళబెట్టాను. తేరుకుని "ఏంటీ... అరతులం బంగారమా? ఎవరికీ... నీ ఫ్రెండు తమ్ముడి పెళ్ళికి... తలుందా? ఇంట్లో పదిరూపాయల్లేవు... అవతలేం బ్యాంకు బ్యాలెన్సుల్లేవు" అన్నాను.

"ష్... అరవకండి... ఎవరైనా వింటారు. ఎవరైనా వింటారు... ఆ మాత్రం పెట్టకపోతే వాళ్ళు ఏమైనా అనుకుంటారు. మీరే చెప్పండి.. నలుగుర్లో నామోషీ గదా!"

నా వొళ్ళంతా కారం పూసినట్లయింది. లేచి బట్టలేసుకుని అది అరుస్తున్నా పట్టించుకోకుండా బయటపడ్డాను. రెండ్రోజులాగి ఇంటికొస్తే పీడా పోతుంది. పలాయననాదమా? అవును కరక్టే.. మరి ఎదురుపడి ఆవిడతో గొడవపడితే వచ్చేదేముంది? నాకింకా తిక్కరేగితే రెండు పీకినా పీకుతానేమో!

ఇదే బెటరు. ఆవిడెలాగూ ధైర్యం చేసి అప్పుచేయలేదు. ఒకవేళ అప్పు చేద్దామనుకున్నా ఇచ్చేవాడు కూడా లేడు.

ఇదీ సంగతి. చాలామంది ఆడా, మగా తమ కోసంగాక 'ఇతరుల' కోసం బతుకుతున్నారు. ఎవడేమనుకుని పోతాడో అన్నది వాళ్ళ భయమా? అసలు వీళ్ళకో విషయం తెలీదు. ఎవరికోసమూ క్షణం ఆగకుండా పరిగెత్తే సమాజంలో ఎవరి సమస్యలు వాళ్ళవి! ఎవరి బాధలు, కష్టాలు, పితుకులాటలు, సంతోషాలు, విషాదాలు వాళ్ళకు సరిపడా వుండనే వున్నాయి! తనూ, తన ఉద్యోగం, కుటుంబం.. దాని బాగోగులు చూసుకోడానికే నానా యాతనలు పడి పరేషానైపోతున్న సందర్భంలో పరాయివాడి గురించి పట్టించుకునే తీరిక ఎక్కడిది? అందులోనూ ఇప్పుడు అందరూ కూడా వ్యక్తిగత శ్రద్ధాసక్తుల వలయంలోనే పడి కొట్టుకుంటున్నారు.

ఒక వారం గడిచింది.

భానులో కొద్ది మార్పును గమనించాను.

"సరేగాని భానూ, మన సదాశివుడు లేడూ... అదే యమ్మార్వో ఆఫీసులో యూపీసీ... రాత్రంతా క్లబ్బులో ఆడీ... పీకల్దాకా తాగి... ఇల్లు చేరాడట... భార్యామణి తాటకి గదా... జుట్టందుకునో, ఒంగోబెట్టో.. నాలుగంటించి, బకెటునీళ్ళు మీద గుమ్మరించి బయటకు గెంటేసిందట!"

"ష్.. అవన్నీ మనకెందుకండీ..... ఎవరి సంసారం గోల వాళ్ళది. ఎవరెట్లా అఘోరిస్తే మనకేంటి? మన సమస్యలే మనకు గుదిబండలు" అంది.

ఆహా.... ఓహో... చిక్కావే భానూ.. "అదేనే... ఇతరుల గురించి మనం ఎట్లా పట్టించుకోమో... మన గురించి కూడా ఎవరూ పట్టించుకోరని గమనించవలెను అర్థమయిందా?" అనేసరికి భాను తెల్లబోయింది.

✤

పాఠకులకు మనవి
మీకు లేదా మీవాళ్ళకు న్యాయ సంబంధమైన ఇబ్బందులేమైనా తలెత్తాయా? ఏం చేయాలో పాలుపోక సతమతమవుతున్నారా? అయితే వెంటనే ఆ సమస్యేంటో మాకు తెలియజేయండి. న్యాయవాది **శ్రీ జి.ఎల్.నరసింహారావు** తగిన పరిష్కారాన్ని తెలియజేస్తారు. మా చిరునామా: ప్రజాశక్తి, ఆదివారం అనుబంధం, ఫ్లాట్ నెంబర్: 1, అశోక్ నగర్, హైదరాబాద్ - 500 020.

తీర్పు అమలు చేయలేదు

నేను నిరుద్యోగిని. గ్రూపు - 2 (1999) నోటిఫికేషన్ ద్వారా కటాఫ్ కాలంలోనే అన్ని ఖాళీలూ భర్తీ చేయాలని రాష్ట్ర హైకోర్టు 2003 జూలైనెలలో తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు ద్వారా 1200 ఖాళీలు భర్తీ అయ్యాయి. ఆనాటికి ఇంకా ఖాళీలు ఉన్నాయని ట్రిబ్యునల్‌కు వెళ్ళాం. అక్కడ 2005 అక్టోబర్ 21న తీర్పు ఇస్తూ 480 పోస్టులు భర్తీ చేయాలంటూ తీర్పు ఇచ్చింది. అయితే ఆ తీర్పు ఇవాల్టికీ అమలు చేయలేదు. మేం సమాచార హక్కును వినియోగించుకుని (1999) దరఖాస్తు చేయగా అందులో 559 ఖాళీలు ఉన్నాయని ఆయా డిపార్ట్‌మెంట్స్ ద్వారా తెలియవచ్చింది. ఇప్పటికి నాలుగు నెలలు గడిచినా ఫలితం శూన్యం. మాకు న్యాయం ఎలా జరుగుతుంది? ఖాళీల భర్తీకై మేం ఎక్కడ కేసు వేయాలి? హై కోర్టు ఇచ్చిన తీర్పు కాబట్టి కోర్టు ధిక్కారం కింద కేసు వేస్తే ఎలా ఉంటుంది? కేసు వేయడానికి ఎంత ఖర్చు అవుతుంది?

- ఓ నిరుద్యోగి

జి.ఎల్.నరసింహారావు
హైకోర్టు న్యాయవాది
9848994240

మీరు ఈ పాటికే కోర్టులో తీర్పు పొంది ఉన్నారు. కావున కోర్టుధిక్కారణ నోటీసులు అధికారులకు ఇచ్చి హైకోర్టులో కేసు వేయవచ్చును. మీ తరపున న్యాయవాది ఉన్నారుకదా... మీరు వెళ్ళి వారినే కలవండి. ఖర్చులు, ఫీజుకు సంబంధించిన విషయాలన్నీ అతనే వివరించగలరు.



అసంతృప్తి

"ఎలా వుందండీ నా వంట?" కొత్త పెళ్ళాం గోముగా అడిగింది.

"వంటకేం, బ్రహ్మాండం! కానీ ఇది తినటానికి వెండి పళ్లెం కావాలనడిగితే కొనిచ్చి చచ్చాడు కాదు నీ అయ్య" అన్నాడు సరసం తెలియని మగడు, తనకొచ్చిన కట్నకానుకలపై ఇంకా అసంతృప్తితోనే రగుల్తూ.

శ్రీకృష్ణ వరప్రసాద్

పొగడ్తా?!

"నా అందానికి సినిమా హీరోలాంటి మొగుడొస్తాడు, ఏమనుకున్నావో!" బడాయిగా చెప్పింది గిరిజ.

"నీదెంత దొక్కు ఆలోచనే! నువ్వే సినిమా హీరోయినై పోరాదా! సినిమా సినిమాకీ మొగుళ్లు మారిపోతారు" పొగడ్త రూపంలో గేలి చేసింది నీరజ.



ఇంటి సంగతులు

ఇంద్రగంటి జానకీబాల

కళాకారులు...

సినిమానించి ఇంటికి వస్తుంటే కామాక్షి మనసు ఆవేశంతో ఊగిపోవడం మొదలెట్టింది. ఆహా! ఎంత చక్కటి సంగీతం? ఎంత చక్కటి డ్యాన్సులు. పిల్లలిద్దరూ చిన్నప్పటి నుండీ ఎంతో శ్రద్ధగా నేర్చుకున్నారు. చిన్నవయసులోనే పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నారు. రాజా, రమణిలు కూడా అలా గొప్ప కళాకారులై దేశవిదేశాల్లో పేరు తెచ్చుకుంటే తనకెంత గర్వంగా వుంటుంది? ఇంతకాలమూ ఈవిషయం ఎందుకాలోచించలేదో అర్థంకావడం లేదు. విజయలక్ష్మిగారి పిల్లలు అప్పుడప్పుడు రోటరీ ఉత్సవాల్లో పాటలు పాడి, డ్యాన్సులు చేసినా, తను అదొక సాధారణవిషయంగా చూసిందేగానీ తన పిల్లలకీ నేర్పించాలని అనుకోలేదు. అమ్మో! ఈ సినిమాలో చూస్తే బలేబాగుంది. ఇంక ఆలస్యం చెయ్యడం మంచిదికాదు. అయినా ఇద్దరికీ డ్యాన్సు మాష్టర్ని, సంగీతం టీచర్ని కుదర్చటం పెద్ద సమస్యేం కాదు. తనకి స్థోమత లేదనే బెంగాలేదు. కామాక్షి మనసు కళలపట్ల, కళారాధన పట్ల వ్యామోహంతో ఉప్పొంగిపోయిన మాట నిజమే! అయినా అంతకంటే అప్పుడొచ్చే కీర్తి ప్రతిష్టలు ఆమె మనసును మరీ ఆక్రమించాయి. వెంటనే 'మా అమ్మాయి డ్యాన్సు చేస్తుందండీ! ఫలానా వారి శిష్యురాలు. మా అబ్బాయి పాడతాడు. టివీల్లోనూ, స్టేజి మీద అవలీలగా పాడతాడు.. మా పిల్లలు ఇద్దరికిద్దరూ మాంచి కళాకారులు' అని మిత్రులందరి దగ్గరా గర్వంగా చెప్పుకోవాలని ఆమె తహతహలాడి పోవడం మొదలుపెట్టింది.

రాత్రి భర్త రామారావు ఇంటికి రాగానే "పిల్లలకి సంగీతం, నాట్యం నేర్పించుదామనుకుంటున్నా" అని చెప్పింది.

"ఇదేంటి? ఎప్పుడూ లేనిది" అన్నాడాయన ఏదో వస్తువు కోసం వెతుక్కుంటూ.

"ఎప్పుడూ లేకపోతే ఇప్పుడు వుండకూడదా?" అంది.

"నిజమే.. కానీ.. సరే నీ యిష్టం" అంటూ తన పనిలో మునిగిపోయాడు. మర్నాడు లేస్తూనే ఫోన్లమీద సంగీతం టీచరు కోసం, డ్యాన్సు మాష్టారికోసం వేట మొదలుపెట్టింది. రెండుగంటల వేట తర్వాత సాయంత్రం నాలుగు గంటలకు డ్యాన్సు మాస్టారు వస్తానన్నారు. సాయంత్రం ఆరుగంటలు దాటాక సంగీతం టీచరు వనజగారు వస్తానన్నారు. నిజానికి అంతవ్యవధి కూడా ఆగలేకుండా వుంది కామాక్షి. చేసేదేమీలేక వుండిపోయింది. పిల్లలిద్దర్నీ పిలిచి చెప్పింది. రమణి తలవూపింది రాజా మాత్రం 'సాయంత్రం నాకు స్పోర్ట్సు వుంటాయమ్మా' అన్నాడు.

"చూసుకుందాంలే నీ ఆటలకు అడ్డురాకుండానే టైంపెడతా" అంది తల్లి కొడుకుని గారం చేస్తూ "అయితే నాకేం అభ్యంతరం లేదు" అంటూ గెంతులేశాడు. తన కూతురు ఎమ్మెస్ సుబ్బలక్ష్మి లాగానో లేకపోతే సుశీల, జానకిల్లాగానో పాడితే చాలు అనుకుంది కామాక్షి. సాయంత్రం డ్యాన్సు మాష్టారు వచ్చి మాట్లాడివెళ్ళారు. "భరతనాట్యం, కూచిపూడి తప్పితే మోడరన్ స్టైల్లో ఏది కావాలనుకుంటున్నారు?" అనడిగేసరికి కామాక్షి కంగారుపడిపోయింది. కానీ శాస్త్రీయమైన కూచిపూడి కావాలని చివరికి తేల్చింది.

ఆయన ఫీజు చెప్పి, పిల్లలను తన స్కూలుకు పంపాలని చెప్పి వెళ్ళిపోయాడు. ఆరుగంటలకొచ్చిన వనజ కూర్చుని కబుర్లు చెప్పింది. సంగీతం గురించి, దాని గొప్పతనం, పవిత్రత గురించి చెప్పింది. చివరిగా "పాపను పిలవండి. అసలామె గొంతెలా వుంటుందో శృతిలో వుందో, లేదో చూద్దాం" అంది.

కామాక్షి మనసు చివుక్కుమంది. "అవన్నీసరే.. మీరు శ్రద్ధగా నేర్పిస్తే, నేను అమ్మాయిని కూర్చోబెట్టి ప్రాక్టీసు చేయిస్తాను" అంది.

"నేను చెప్పడానికి ముందు, ఆమెకెంత సంగీతజ్ఞానం వుందో చూద్దామనీ"

"జ్ఞానం అవీ పిల్లలకేం వుంటాయండి, మనం నేర్పించటంలోనూ, వాళ్ళ శ్రద్ధలోనూ వుంటుంది గానీ" అంది కామాక్షి.

వనజ బిక్కముఖం పెట్టింది. ఇంతలో కామాక్షి మళ్లీ కల్పించుకుని "మీవద్ద నాకు దాపరికం దేనికి? మా రమణి ఒక ఆర్నెల్లలో చిన్నసైజు కాన్సెప్ట్ యిచ్చేలా తయారవ్వాలని నా కోరిక" అంది.

"కచ్చేరీ చేసే స్థితి రావాలంటే చాలా బ్యాగ్రౌండు వుండాలండి" అంది.

"అన్నీవుంటే వాళ్ళే సొంతంగా పాడేస్తారు. వాళ్లకు కావల్సింది నేర్పించి ప్రాక్టీసు చేయిస్తే అన్నీ వస్తాయికదండీ. కృషితో నాస్తి దుర్భిక్షం అన్నారు కదా పెద్దలు" అంది.

రమణితో "సవస" పట్టించిన వనజకి ముచ్చెమటలు పోశాయి. అయినా బయటికి తేలలేదావిడ. "చూద్దాం మంచిరోజు చూసి ఫోను చెయ్యండి" అంటూ తన ఫీజు చెప్పి, వారానికి మూడుక్లాసులు తీసుకుంటానని చెప్పింది.

"ఏమైనా మీరు మా అమ్మాయికి ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుని చెప్పాలి" అంటోన్న కామాక్షి మాటల్లో వనజకు అర్థమైందేమంటే సినిమా ప్రభావంలో కామాక్షి మునిగి ఉందని.

సంగీతానికి ఉండాల్సిన శృతి జ్ఞానం రమణికిగానీ, నృత్యానికుండాల్సిన తాళ జ్ఞానం రాజాకుగానీ లేవు. వెరసి కామాక్షికి ఏ జ్ఞానమూ లేదు, అజ్ఞానం తప్ప. ఏ ఆర్టుకైనా ప్రాథమికంగా వాళ్ళలో దానికి కావలసిన ముడిసరుకు వుండాలన్న కనీస జ్ఞానం ఆమెకిలేదు.

ఆరు నెలలు తిరిగినా ఇద్దరూ అంగుళం కూడా ముందుకి సాగలేదు. చేసిన డబ్బు ఖర్చు తల్చుకుంటుంటే కామాక్షికి ఎంతో బాధగావుంది. తన పిల్లలకున్న ప్రతిభగురించి అర్థం చేసుకునే ప్రయత్నం ఆమె ఎప్పుడూ చేయలేదు. టీచర్లు సరైన శ్రద్ధ తీసుకుని చెప్తే తన పిల్లలకి కళలు పట్టుబడేవే కానీ ఎందుకో వారు శ్రద్ధగా చెప్పటం లేదని తేల్చింది. ఒక సుముహూర్తంలో ఇద్దర్నీ మాన్పించింది. అప్పటికి సినిమా ప్రభావం తగ్గింది. పిల్లలిద్దరూ హాయిగా ఊపిరి పీల్చుకుని ఆనందంతో గంతులు వేశారు. ఆ ఆనందాన్ని సెలబ్రేట్ చేసుకోవడానికి సినిమాకు బయలుదేరారు. కామాక్షి మాత్రం డ్యాన్సులు, సంగీతం, కవిత్వం లాంటి గొడవలు లేని సినిమాను ఎంపిక చేసిందావేళ.

ఇలా వృందామా...

తంగెళ్ళపల్లి కనకాచారి

సత్సంబంధాలు

"ఏయ్ సూర్యా, ఈరోజు వీక్లీ ఆఫ్ కదా! సినిమాకు చెక్కేద్దామా?" అడిగాడు నిఖిల్.

"నిఖిల్, నేను మా బావగారింటికి వెళ్లాలి, ప్లీజ్, ఈరోజు నన్నొదిలేయ్" రిక్వెస్టింగ్‌గా అన్నాడు.

కొత్త ఫిల్మ్ రిలీజైందిరా ఈరోజు"

"బాబూ... ప్లీజ్...!"

"సరే..! నేను వెళ్తాను, రాత్రికైనా వస్తావా?"

"చెప్పలేను, ఈవినింగ్ ఫోన్ చేస్తాగా...!"

"మంచిది" మూతిముడుచుకున్నాడు నిఖిల్. అంతలో సూర్య సెల్ మోగగా "హలో, అక్కా!, టెన్‌కల్లా వచ్చేస్తా... సారీ అక్కా... ఆఫీసులో పని ఒత్తిడి... అబ్బే లేదు, నిజంగా వస్తా... లేదులేదు మరే ప్రోగ్రామూ పెట్టుకోకు... నిజంగా వస్తున్నా... బయల్దేరుతున్నా... నిఖిల్‌తో అదే డిస్కస్ చేస్తున్నా... సరే వుంటాను"

"సూర్యా, నిన్న ఇన్‌ల్యాండ్ లెటర్స్ తెమ్మన్నావు, నేవెళ్ళే దారే కదాని ఏదో ఒక పని చెప్తావు, ఇంతకీ కొత్తగా లెటర్సేమిటిరా?" కుతూహలంగా అడిగాడు నిఖిల్.

"మా ఊళ్ళో ఓ ఫ్రెండ్ ఉన్నాడని చెప్పానే, చాలా క్లోజ్... ఫోన్‌లో మాట్లాడ్తుంటాను.. ఇపుడు పర్సనల్‌గా లెటర్ రాయాలన్పించింది"

"శరత్ అని చెప్పావు, తనేనా?"

"అవున్రా"

"అవునులే, నువ్వు ఈమధ్య అందర్కీ టైం ఇచ్చేసి అందర్నీ పట్టించుకుంటున్నావ్... ఏంట్రా సంగతి?"

"మనుషుల మధ్య సంబంధాలుండాలి. ఒకరి అభిప్రాయాలు మరొకరు తెల్సుకోవాలి. అనుభవాలు, అనుభూతులు పంచుకోవాలి. ప్రేమగా, కపటం, లేకుండా ఉన్నది ఉన్నట్లుగా వాన వెలిశాక మెరిసే చెట్టులా, వెన్నెల రాత్రుల్లో డాబాపై నవ్వుతూ మాట్లాడే మాటల్లా, ప్రకృతి పచ్చదనంలా మనసులు ఆవిష్కృతం కావాలి"

"ఇవన్నీ చెయ్యడానికి, అందర్నీ కలవడానికి టైమేదిరా మనకు? లేచిందగ్గర్నుండీ పరుగో...పరుగై ఛస్తుంటేనూ..."

"మనసుంటే మార్గం లేదా? నిన్న పంజగుట్టలో చూశా, క్షణంలో బస్‌ను హోండా ఢీకొట్టింది. హోండాపైనుండి పడ్డ ఓ యువకుడు అక్కడిక్కడే చనిపోయాడు. ఏ తల్లి బిడ్డడో... ఏ ఊరో... ఎన్ని స్వప్నాలు కన్నాడో... నిర్జీవంగా రోడ్డుపై రక్తపు మడుగులో.... బాబోయ్. తల్చుకుంటేనే భయంగా, బాధగా వుంది. అసలు మనం ఎక్కడికి పోతున్నాం? దేనికోసం పరుగెత్తుతున్నాం? కాలం చట్రంలో అలుపెరుగకుండా నడుస్తోంది ఏ గమ్యానికి? ఈ చిన్న జీవితంలో ఎన్ని ఘర్షణలు! ఎన్ని సంఘర్షణలు!! ఇదంతా ఆలోచిస్తుంటే రాత్రి నిద్రపట్టడం లేదు తెల్సా... ఉన్నంతలో హ్యాపీగా పనిచేస్తూ మానవ సంబంధాల్ని పటిష్ట పర్చుకోవాలని... అందర్నీ పలకరించాలని, ఆత్మను తడిమి వ్యక్తుల్ని అర్థం చేసుకోవాలని అన్పిస్తుంది"

"లెక్చర్ తరువాత, బయల్దేరు, మళ్ళీ మీ అక్క ఫోన్ చేసేట్టుంది. ఎన్నిసార్లు మీ బావగారు నీ కోసం ఆఫీసుకు వచ్చారు?! నువ్వెన్నడూ వాళ్ళ ఇంటికెళ్ళిన పాపాన పోలేదు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకున్నందుకు థ్యాంక్స్"

"అరే, తిట్టకురా" నవ్వుతూ అన్నాడు సూర్యా.

❄ ❄ ❄

"సూర్యా, నువ్వొస్తావని, ఈరోజు స్పెషల్‌గా చక్రాలు చేశాను"

"థ్యాంక్స్, అక్కా! అమ్మ దీపావళి లాంటి పండుగరోజుల్లో ప్రత్యేకించి నా కోసమని చక్రాలు చేసేది"

"అవును, చక్రాలు తిన్నాక, ఇంటికి ఫోన్ చేద్దాం ఓ వారం రోజులపాటు అమ్మానాన్నల్ని రమ్మందాం. ఇక్కడ కొంచెం రెస్ట్ తీసుకుంటారు. నాన్నగారు చిన్నప్పటినుండీ బతుకుపోరాటమే ఇప్పటికైనా రెస్ట్ తీసుకోమంటే తీసుకోడుగా"

"అమ్మానాన్నల కోసం బట్టలు తీసుకుందామని అనుకుంటున్నా ఈ నెల జీతంరాగానే"

"సరే, నువ్వు చెప్పినట్లే చేస్తాను"

అంతలో కాలింగ్ బెల్ మోగింది. సూర్యా వెళ్ళి తలుపు తీసి "అరె.. బావగారూ! ఆశ్చర్యం, మీరేంటిలా?" అన్నాడు.

"ఇన్‌ఛార్జికి చెప్పి వచ్చాను, నువ్వు వస్తున్నావని తెల్సి. ఇదిగో నీకోసం కొత్త సెల్ తెచ్చాను. నీ సెల్ సరిగా పని చేయట్లేదన్నావుగా"

"థ్యాంక్స్ బావగారూ"

"ప్రణతీ, సాయంత్రం పిల్లలొచ్చాక ఎన్.టి.ఆర్. గార్డెన్‌కు వెళ్దాం.. ఏమంటావు సూర్యా"

"అలాగే బావగారూ"

కొత్త సెల్ తీసి, ఇంటికి ఫోన్ చేశాడు సూర్య.

"అమ్మా....! బావున్నారా? ఎలావుంది ఇద్దరి ఆరోగ్యం? అక్క హైదరాబాద్ రమ్మంటోంది... వచ్చే ఆదివారం బయల్దేరుతున్నారా? మంచిది రైల్వే స్టేషన్‌కు నేను. నిఖిల్ వస్తాం. పక్కన నాన్నగారు ఉన్నారా? హలో.. నాన్నగారూ, ఎలా వున్నారు? ఆరోగ్యం జాగ్రత్త... ఎప్పట్లాగే ఏవో కార్యక్రమాల్లో పాల్గొంటున్నారా? కాస్త మీ ఆరోగ్యం కూడా పట్టించుకోండి...!'

"సూర్యాలో మంచి మార్పు వచ్చింది" చిన్నగా నవ్వుతూ గొణిగాడు బావ.

సీరియల్

తెలంగాణ

గొల్లపూడి నారాయణరావు

జరిగిన కథ

ఛోటామియాను కోదండరాంరెడ్డే చంపివుంటాడని అనుమానించాడు బడేమియా.

పటేలా మాటను తోసిపుచ్చుతూ ముసలివాడు, మిలట్రీ దెబ్బలకు కీళ్ళు విరిగినవాడూ ఆజానుబాహుడైన ఛోటామియాపై కలబడి చంపడం సాధ్యంకాదన్నాడు.

అంతలో హవల్దారు కల్పించుకుని హత్య చేసింది ప్రతాప్‌రెడ్డి కావచ్చని, గతరాత్రి ఇద్దరు మనుషులు గోడెక్కి పారిపోతుండగా చూశానన్నాడు.

(43వ భాగం)

"ఆ ఇద్దరూ ఆడవాళ్లా, మగవాళ్లా?" ప్రశ్నించాడు పటేలు.

"ఆళ్ళు మగాళ్ళే భయ్యా.. మేం సిపాయల్కి కేకలేసి అందరం కలిసి లోపల్కి పోయేసర్కి వాళ్లు గాయబ్ అయిపోయినరు" అన్నాడు హుసేను.

"అయితే వాళ్లిద్దరూ ప్రతాప్‌రెడ్డి, యాదవరెడ్డి అయివుంటారు" అన్నాడు పటేలు. ఆ ఇద్దరి పేర్లు ఉచ్చరించేసరికి అతడి గుండెలు దడదడలాడినయ్.

అంతలోనే కాశిం సాహెబు లేచినిల్చున్నాడు. "ప్రతాప్‌రెడ్డి నాకూ కన్పించినడు" అన్నాడు.

అందరూ అతడివైపుకు ఆశ్చర్యంగా చూశారు.

"నీకు ఎప్డూ కన్పించినడు కాశిం?" అనడిగాడు బడేమియా.

"ఇంతకుముందు గిల్కల్ చావుడీ దగ్గర కన్పించినడు, నాకీ చూసీ జొన్నచేన్కు అడ్డంపడి పరారీ అయిపోయినడు" అన్నాడు కాశిం.

"ప్రతాప్‌రెడ్డి నీకు తెలుసా కాశింగారూ?"

"నాకు బాగా తెల్సునయా పటేలు సాబ్. ప్రతాప్‌రెడ్డి ఎర్రగా, బక్కపల్చగా ఉంటడు. కరాఫీ వుంగరాలు తిర్గి వుంటది" అన్నాడు కాశింసాహెబు.

అతడు చెప్పినదాంతో ప్రతాప్‌రెడ్డి గుర్తులన్నీ సరిపోయినయి. పటేలు తలూపాడు.

"గుర్తులనుబట్టి వాడు ప్రతాప్‌రెడ్డి అయివుంటాడు" అన్నాడు.

దాంతో అందరిమధ్యా కాసేపు చర్చలు సాగినయి. ప్రతాప్‌రెడ్డి గ్రామంలోకి రాకపోకలు సాగిస్తున్నాడని దృఢనిశ్చయానికి వచ్చారు. మరుక్షణమే అందరి గుండెలూ జలదరించినయి.

"ఇంతగా కాపలాల్ చేస్తాంటే ప్రతాప్‌రెడ్డి గేమంలోకి ఎట్లావచ్చినడు?" అన్నాడు హవల్దారు.

"దీన్కి గేమం వాళ్లందరి లాలూచీ వుంది సాబ్" అన్నాడు బడేమియా.

"అందర్నీ పిలిపించి మళ్లీ ఒకసారి మక్కెలు విరుగతన్నించాలి" అన్నాడు పటేలు.

"సచ్చీబాత్‌హై" అన్నాడు హవల్దారు.

అప్పటికి మనికొండకు వెళ్లే సిపాయిలందరూ ప్రయాణమై బయలుదేరారు. అప్పుడే రూబేను అక్కడికి వచ్చాడు. అతడు వస్తూనే "రాత్రి మనికొండగడీ దోపిడీ అయపోయిందట దొరా" అన్నాడు.

అతడి మాటలతో పటేలు ముఖం సంతోషంతో వెలిగి చేటంత వెడల్పు అయింది. అతడు తప్ప మిగతావారంతా ఆ వార్తవిని అదిరిపడ్డారు.

"అరె అల్లా" అన్నారు అక్కడివారందరూ. నాలుగు నిమిషాలదాకా మాటే లేకుండా మౌనంగా ఉండిపోయారు.

చివరికి హవల్దారు "రూబేన్, నీకి ఈ విషయం ఎట్లా తెల్సినది?" అనడిగాడు.

రూబేను నవ్వి "ఇలాంటి వార్తలు తెలీకుండా ఆగుతాయా దొరా? మనికొండ మనిషి పులిగూడెం పోతూ ఇంతకుముందే నాకు కనిపించి చెప్పాడు. సంగంవోళ్లు ఓ పెద్దగుంపు పోయిపడి గడీనంతా లూటీ చేసుకుని ఎల్లిపోయారట" అన్నాడు.

హవల్దారు తలూపాడు. పైకి చూస్తూ ఆలోచనలో పడ్డాడు. కాసేపటికాతడు "సంగం దళం ఈ ప్రాంతంలో ఎక్కాలేదని అనుకుంటుండం గదా" అన్నాడు.

"ఏక్కడా లేకపోవడం ఏమిటీ? మన కాశింగారికి ప్రతాప్‌రెడ్డి కనిపించింది ఇవాళనే గదా" అన్నాడు పటేలు.

"ప్రతాప్‌రెడ్డి దళంలో ఈ చుట్టుపక్కల వున్నాడని బాగా వదంతులున్నవి" అన్నాడు రూబేను.

హవల్దారు తలూపాడు. బయల్దేరిన సిపాయిలందరినీ ప్రయాణం ఆపుచేయించాడు. ప్రజలందరినీ పట్టుకురమ్మని మిలట్రీవాళ్ళను గ్రామంలోకి పంపాడు.

పావుగంట గడచిపోయింది. మిలట్రీ గ్రామంలోకి ప్రవేశించి కనిపించిన వాడినల్లా పట్టుకుని తీసుకువచ్చారు. పటేలు ఇంటిముందు ఆవరణంలో అందరినీ కుదవ వేశారు.

హవల్దారు వేపచెట్టు నీడకు వచ్చి నిల్చున్నాడు.

"అరె సత్తెం సెప్పండిరా. ప్రతాప్‌రెడ్డి గేమంలోకి వచ్చిపోతున్నాడని మాకు తెల్సింది" అన్నాడు.

"మాకేమీ తెలీదయ్యా" అంటూ గ్రామం వారందరూ ఒక్కసారిగా అన్నారు.

"మీకు తెల్వాకుండా ఎట్లా వచ్చిపోతున్నడు.

మీరు కాపలాల్ కాయటంలేదూ?" అడిగాడు హవల్దారు.

"అందరం కావలాలు కాన్తానే ఉన్నామయ్యా" ఒక్కసారిగా అరిచారు అందరూ.

ఇంతలో రూబేను కలిగించుకున్నాడు. పుల్లారెడ్డివైపుకు చూపిస్తూ "ఈయన రెండురోజులనుండి కాపలాకు రావటంలేదు దొరా" అన్నాడు.

హవల్దారు మండిపడుతూ పుల్లారెడ్డి వంకకు చూసి "ఏమిరా నీవు కాపలా కాయటం లేదూ?" అని గర్జించాడు.

"రెండు రోజులనుండి జ్వరం వస్తోందయ్యా. అందుకని కాపలాకు పోలేకపోయాను" అన్నాడు పుల్లారెడ్డి.

హవల్దారు తలూపాడు. రూబేను అంతటితో ఊరుకోలేదు. అందరిపైన శికాయతీలు చెప్పనారంభించాడు. మల్లారెడ్డి, కృష్ణారెడ్డి ఇద్దరూ గ్రామంలోకి వచ్చి అన్నం తిని పోతున్నారని బ్రహ్మారెడ్డి ఇంట్లోకి యాదవరెడ్డి పోతుండగా చూశానని, బ్రహ్మారెడ్డి దళం వాళ్లకు అన్నం ఎత్తుకుని పోతూ కనిపించాడని, ఇలాంటివన్నీ చెప్పాడు.

బ్రహ్మారెడ్డి కలిగించుకుని "ఒరి నీయమ్మ కడుపుకాలా. చేయని నేరాలు తెచ్చి మాకెందుకు అంటగడ్తావురా రూబేనూ?" అన్నాడు.

రూబేను ఎగిరిపడ్డాడు. "నీవు దళానికి అన్నం మోసుకుపోలేదు? మొన్న రాత్రి సవళ్లబాటన జంటమామిళ్ల దగ్గర మూట ఎత్తుకుని నువ్వు నాకు ఎదురుపళ్లేదూ?" అన్నాడు.

"ఒరి అబద్ధాల గాడెదకొడ్కా" అన్నాడు బ్రహ్మారెడ్డి ఆశ్చర్యంతో.

మరుక్షణమే హవల్దారు బ్రహ్మారెడ్డి వీపు చిట్లిపోయేట్టుగా ఒక్క దెబ్బకొట్టాడు. ఉరిమి చూశాడు.

"ఖబడ్దార్ సంగం వాళ్కీ బువ్వల్‌మోసి పైగా మా మదుసుల్‌కి తిడ్తాండవు?" అన్నాడు.

బ్రహ్మారెడ్డి అంతటితో కిక్కురుమనకుండా తలవంచుకుని నిల్చున్నాడు. తర్వాత రూబేను అందరివైపుకు చూస్తూ "వీరందరు సంగం వాళ్లకు అన్నాలు మోసినవాళ్లేనండి. నేను సొయంగా చూశాను" అని గట్టిగా రాయి గుద్దినట్లు చెప్పాడు.

హవల్దారుకు అతడి మాటలపై పూర్తిగా నమ్మకం కుదిరింది. సిపాయిలందరివైపుకు చూస్తూ "వీళ్లందర్కి బొక్కాలిర్గ తన్నండి" అని ఆజ్ఞాపించాడు.

మరుక్షణమే సిపాయిలు దండాలెత్తుకుని గ్రామ ప్రజలపై విరుచుకపడ్డారు. దండాల బరాటీలతో ఆ ప్రదేశమంతా 'బయ్' మనే మోత పుట్టింది. ప్రజలందరూ లబోదిబోమని మొత్తుకోనారంభించారు.

"ఒరే రూబేనుగా! మా ఉసురెందుకు పోసుకుంటావురా?"

"నీ కడుపుగాల"

"నీ ఇల్లు వల్లకాడుగాను"

ఈ విధమైన తిట్లతో అరుపులు సాగుతున్నాయ్. అందరి వైపుకు హవల్దారు చురచురలాడుతూ చూచాడు. "వీళ్లందర్కి చేతుల్, కాళ్లు అంటగట్టి ఎండలో పడేయండి" అన్నాడు.

ఆయన ఆజ్ఞాపించడమే తడవుగా సిపాయిలు తాళ్లు సిద్ధం చేసుకుని వచ్చారు. అందరి కాళ్లూచేతులూ అంటగట్టి కోళ్ల కొక్కిరాయి వేసి మండిపోతున్న పాటి దుమ్ములో పడదోశారు. దాంతో ప్రజలంతా మరింత బిగ్గరగా కేకలు వేయనారంభించారు.

"నద్దు చేయకండిరా" అంటూ సిపాయిలు దుమ్ములోపడి దొర్లుతు న్నవారి మోకాళ్లపైన, మోచేతులపైన తీవ్రంగా కొట్టారు. ఆ దెబ్బలకు భయపడి కింద కాలుతున్నా కిక్కురమనకుండా పడున్నారు.

పొద్దు నడినెత్తికి వస్తోంది.

అప్పుడే వేటవలావు ఆరగించి హవల్దారు త్రేవుమని తేన్చుతూ వెలుపలికి వచ్చాడు. ఆయన కనిపించగానే ఇంతసేపటి నుండి ఎండలోపడి మగ్గుతోన్న బ్రహ్మారెడ్డి వగైరాలందరూ "దండాలయ్యా, దండాలు సామీ" అనరిచారు.

హవల్దారు నవ్వుతూ వారి సమీపానికి వచ్చి నిల్చుని "ఏమిట్రా?" అన్నాడు.

"ఒళ్లు మండి పోతోంది అయ్యా" అన్నాడు బ్రహ్మారెడ్డి.

"వీపు కాలిపోతాందయ్యా" అన్నాడు పుల్లారెడ్డి.

చేతులు ఒరుసుకు పోతున్నాయ్ దొరా" అన్నాడొకరు.

"కాళ్లు కొంకర్లు పోతున్నాయ్ దొరా" అన్నాడు మరొకాయన.

ఈ విధంగా మొరపెట్టుకున్నారు. హవల్దారు తిరిగి నవ్వాడు. "సంగం వాళ్లకు బువ్వల్ మోస్తారురే?" అనడిగాడు.

"ఇంకెప్పుడూ మోయమయ్యా"

"బుద్ధొచ్చింది"

"ఈసారికి వదిలేయండి"

ఈ విధంగా చేయని నేరాలను కూడా ఒప్పుకుని క్షమార్పణలు కోరుకున్నారు. హవల్దారు తలూపాడు. "కాపలా కాయటాన్కి తప్పకుండా రావాలి" అన్నాడు.

"తప్పకుండా వస్తామయ్యా" అని అందరూ ఒప్పుకున్నారు.

హవల్దారు, వారినందరినీ వదిలివేయమని సిపాయిలకు ఆజ్ఞ ఇచ్చాడు. సిపాయిలు కోళ్ల కొక్కొరాయిలన్నీ విప్పివేశారు. ప్రజలంతా లేచి దుమ్ము దులుపుకున్నారు. బొప్పులు కట్టిన చోటల్లా చేతులతో తడుముకుంటూ, కుంటుతూ సోలుతూ ఇళ్లకు వెళ్లిపోయారు.

❖ ❖ ❖

సాయంత్రం అరపొంట ప్రొద్దువుంది. పటేలు ఇంటి ముందు వేపచెట్ల నీడన రజాకారులందరూ కూర్చుని పేకాట జోరుగా ఆడుతున్నారు. వారికి సమీపంలోనే హవల్దారు, బడేమియా, పటేలు ముగ్గురూ కూర్చుని మాట్లాడుకుంటున్నారు. మాటల సందర్భంగా ప్రతాప్‌రెడ్డి వూసు వచ్చింది.

"ప్రతాప్‌రెడ్డి బడా చలాకి ఆద్మీహై" అన్నాడు హవల్దారు.

దానిని బడేమియా సమర్థించాడు. "అవునుసాబ్, ప్రతాప్‌రెడ్డి వేషాల్ బనాయిస్తూ మనలోనే తిర్గుతుంటాడు. హవల్దారు తలూపాడు. "ప్రతాప్‌రెడ్డి ఏం వేషాల్ ఏస్కుని వస్తడు? మీకీ తెల్సా బడేమియా సాబ్?" అన్నాడు.

"మంగల్ ఏషం, చాకల్ ఏషం, సన్నాసి ఏషం ఇంకా షానాషానా ఏషాల్ బనాయిస్తాడని ఇన్నాం" అన్నాడు బడేమియా.

"అచ్చా" అన్నాడు హవల్దారు. తలూపుతూ "చాకల్, మంగల్ సన్నాసుల్ వచ్చినప్పు జెరా కన్పెట్టి ఉండడం మంచిది" అన్నాడు తిరిగి.

అంతలోనే హుస్సేనుసాహెబు ఉడకబెట్టిన కోడిగుడ్లను, కాల్చిన చీకులను గంపకు వేసుకుని వచ్చాడు. కాశింసాహెబు సారాజాడి తెచ్చి దింపాడు. జాడీ సీలు పెకిలించివేశాడు.

అప్పటికప్పుడే ఆ ప్రదేశమంతా సారావాసనతో నిండిపోయింది. పేకాడుతున్న మూకంతా లేచివచ్చి జాడీ చుట్టూరా చేరారు. గురకలు పెట్టి నిద్రలు పోతున్న సిపాయిల గుంపు తుళ్లిపడి లేచింది. కళ్లు నులుముకుంటూ లేచి వచ్చి చీకుల గంపచుట్టూరా చేరారు. అందరి ముఖాలు కళకళ్లాడుతూ కనిపించాయి.

హవల్దారు, బడేమియా, పటేలు ముగ్గురికి తినుబండారాన్నీ ప్రత్యేకమయిన ప్లేట్లలో కేటాయించారు. మిగతా వారందరూ గంపను మధ్యన ఉంచుకుని గ్లాసులతో సారా ముంచుకుని తాగుతూ చీకులు, కోడిగుడ్లు మధ్యమధ్యన నంజుతున్నారు.

బడేమియా పకపకా నవ్వాడు. గుడ్డు గొంతునపడింది. మింగుడు పడడానికిగాను సారాగ్లాసును ఎత్తి గటగటా తాగాడు. గొంతు సర్దుకున్నాడు. తిరిగి పకపకా నవ్వాడతడు. "పటేల్ జీ" అన్నాడు.

అందరూ అతడివైపుకు ఉత్సాహంగా చూశారు. కాని పటేలు మాత్రం బడేమియా ఏదోమంచి మాటచెప్పబోతున్నాడని ఉవ్విళ్లూరాడు. "ఏమిటి బడేమియాగారూ?" అనడిగాడు.

"పల్హారం అచ్ఛాహై పటేల్‌జీ" అన్నాడు బడేమియా. దానితో మిగతావారందరూ "బహుత్ అచ్ఛాహై" అంటూ సమర్థించారు.

(ఇంకా వుంది)

క్యాంపస్ ఛాట్

కె శివలీల

జెంటిల్మన్...?

"మేం ఆఫర్ చేస్తే రానంటావా..."

"నీ దృష్టిలో మేమెలా కనిపిస్తున్నాంరా..."

"అరె యార్... నీదీ ఓ లైఫేనా... నిన్ను మా రూమ్మేట్ అని చెప్పుకోవాలంటే షేమ్‌గా ఫీలవుతున్నాం"

"ఎంజాయ్ చేయడం బొత్తిగా తెలీదు గురూ నీకు..."

ఫ్రెండ్స్ ఆఫర్ చేసిన డ్రింక్ పార్టీకి వెళ్లడానికి నిరాకరించిన ఫలితం ఇది.

కొన్నాళ్ల తర్వాత...

"పళ్లు రాలగొట్టేవాడు లేనట్లు ఇవేం అలవాట్లు బాబా..."

"ఏంటీ.... నీకా అలవాటున్నట్లు ముందే చెప్పలేదేం..."

"మానుకోవచ్చుగదా..."

"విదేశాల్లో చదువుకుంటూ నువ్వు చేసే ఘనకార్యం ఇదా... ఆంటీకి చెబుతానుండు..."

తను అకేషనల్ లేదా రెగ్యులర్ డ్రింకర్ అని చెప్పిన వెంటనే అతని స్నేహితులు నీరజ, టీనాలు అన్న మాటలివి.. ఈ కొన్నాళ్లలో ఎంత తేడా... అతని అలవాట్లలో ఎంత మార్పు. అంటే... అతను... డ్రింక్ అలవాటుచేసుకున్నాడా?

"నో డౌట్! అందుకు దోహదపడిన పైలిస్టులో వారూ, మానుకోమంటూ సలహాలిస్తున్న కిందిలిస్టులో వారూ ఇద్దరూ నాకు మంచి స్నేహితులే... కొందరు కార్పొరేట్ కల్చర్‌లో నన్ను ఓ భాగస్తుణ్ని చేయాలనుకుంటే... మరికొందరు ఊబిలో కూరుకుపోతున్న నన్ను బయటికి లాగాలని ప్రయత్నిస్తున్నారు. నాకూ మానేయాలనే ఉంది. కానీ... అది అనుకున్నంత సులభం కాదని ఈమధ్యే తెలిసింది...." అంటున్న అతను ఓ ఇంజనీరింగ్ విద్యార్థి.

"ఈ రోజుల్లో ఇలాంటి పరిస్థితి చాలామందికి ఎదురవుతోంది. కొందరు స్నేహితుల బలవంతానికి లొంగిపోతారు. మరికొందరు తమ నిర్ణయాలపైనే గట్టిగా నిలుస్తారు. మొదటిదాన్ని అనుసరించినపుడు బలయ్యేది కెరీర్. రెండవదాన్ని అనుసరించాలంటే కావాల్సింది ఆత్మబలం. ఎందుకంటే 'నా కిష్టంలేదు... సారీ' అని చెప్పినంత మాత్రాన సైలెంటయిపోరు ఫ్రెండ్స్. రకరకాలుగా మాట్లాడతారు. తట్టుకునే బలం లేకపోతే... చాలా కష్టం" అంటున్నాడు బెంగళూరులో ఇంజనీరింగ్ కోర్సు చదువుతోన్న శరత్.

"ప్రపంచం మారుతోంది. దానితోపాటు మనమూ మారాలిగా... ఈరోజుల్లో సిగరెట్లు, డ్రింక్... లాంటి అలవాట్లుండడం కామన్. అవి లేవంటేనే ఆశ్చర్యపోవాలి! రిలాక్సవ్వాల్సిన విషయమేంటంటే... చాలామంది అబ్బాయిలు ఫ్రెండ్‌షిప్ చేసేముందే తమకెలాంటి అలవాట్లున్నాయో ఫ్రాంక్‌గా చెప్పేస్తున్నారు. ఇష్టమైతే ఫ్రెండ్షిప్ చేయవచ్చు. కష్టమైతే మానేయవచ్చు. అయినా తాగేవాళ్లందరూ చెడ్డవాళ్లనీ, తాగని వాళ్లందరూ మంచివాళ్లనీ నమ్మడం పిచ్చితనమే అవుతుంది" అంటున్నారు కోఠి ఉమెన్స్‌కాలేజీ విద్యార్థినులు హరిత, సౌమ్య.

"మీరు డ్రింక్ చేస్తారా? అనడిగినప్పుడు అతను 'అవును' అనే చెప్పాడు. అతని మాటల్లో ఎలాంటి తడబాటూ లేదు. తప్పు చేస్తున్న ఫీలింగనేది లెన్స్ వేసి వెదికినా కనిపించదు. అదేదో గొప్ప అలవాటైనట్లూ... తనకో అదనపు డిగ్రీ అన్నట్లూ అతను ఫీలవడం ఆశ్చర్యాన్నే కలిగించింది. 'మానెయ్యొచ్చుగా...' అసంకల్పితంగా దొర్లిన మాటది... అతని వాలకం చూస్తుంటే చెప్పినా మానేట్లు లేదు. నేనూహించిందే కరెక్టయింది. "నేను మానను..." అతన్నుంచి షార్ప్‌గా వచ్చిందా సమాధానం. అనవసరంగా సలహా ఇచ్చాను. అతను తాగితే నాకెందుకు తాగకపోతే నాకెందుకు హి ఈజ్ మై ఫ్రెండ్... నాతో మర్యాదగానే ప్రవర్తిస్తాడు. దట్స్ ఎనఫ్..." అని చెబుతోంది ఎం.ఎ. ఎకనమిక్స్ విద్యార్థిని ఇంద్రాణి.

"ఏంటీ... డాడీ తిడతారా...? అంటే నేను డ్రింక్ చేశాను డాడీ అంటూ ఇంటికెళ్లగానే రిపోర్టిచ్చుకుంటావు కాబోలు... అంటూ గట్టిగా నవ్వాడు నా ఫ్రెండ్ సుధీర్. శృతి కలిపారు మిగిలినవారు. వారి కంపెనీని నిరాకరించినందుకు నన్ను చాలా హేళన చేశారు. నన్నో పనికిరాని వాడికింద జమకట్టారు. నేను భరించలేకపోయా. గ్లాస్‌లోని డ్రింక్ గటగటా తాగేశా. అప్పట్నించీ అకేషనల్‌గా తాగడం మామూలైపోయింది. ఇంట్లో మాత్రం తెలీదు. తెలిసేంత డోసులో తాగను" అంటున్నాడు ఇంజనీరింగ్ పూర్తిచేసి ప్రాజెక్ట్‌వర్క్ చేస్తున్న ఓ యువకుడు.

"మా ఫ్రెండ్స్‌లో చాలామంది స్మోకర్స్, డ్రింకర్స్ ఉన్నారు. కొందరు వాళ్ల ఇంట్లో తెలియకుండా జాగ్రత్తపడితే, మరికొందరు స్వేచ్ఛాజీవులు. వీరంతా చదివేది కార్పొరేట్ చదువులే. ఈ అలవాట్లన్నీ మా దృష్టిలో కార్పొరేట్ కల్చర్‌లో భాగం. కానీ అలవాట్లను మనం నిర్దేశించగలిగి ఉండాలి. కావలసినప్పుడు మానేయగలిగే మనోబలం ఉండాలి. కానీ చాలామంది అలవాటు చేసుకునేటప్పుడు ఇలాగే అంటారు తర్వాత... ఆ అలవాట్లే వారిని నిర్దేశించడం ప్రారంభిస్తాయి. ఫలితం... కెరీర్ కుప్పకూలుతుంది" అంటున్న మాస్ కమ్యూనికేషన్ విద్యార్థిని తన భర్తకు ఎలాంటి అలవాట్లున్నా తాను ఏమీ అనుకోననీ, అతని అలవాట్లను తనమీద రుద్దడానికి ప్రయత్నిస్తేనే సమస్యలు మొదలవుతాయనీ అంటోంది.

"పార్టీలు, పబ్‌లు డ్రింక్స్... ఇవన్నీ ప్రిస్టేజ్ సింబల్. నేడు వస్తున్న సినిమాల్లో చూస్తున్నది ఇదే కల్చర్. డ్రింక్ అలవాటు లేదంటే ఫ్రెండ్స్ చాలా చులకనగా మాట్లాడతారు. దానిని భరించగలిగే ఆత్మస్థైర్యం, వారి మాటలను తిప్పికొట్టే ధైర్యం అందరికీ ఉంటాయా? చాలామంది మొహమాటస్తులుంటారు... వీరు తేలిగ్గా ఫ్రెండ్స్ మాటలకు పడిపోతారు. అందుకే 'నో' అనేముందు వారి మాటలు ఎదుర్కొనేలా మనసును సిద్ధం చేసుకోవాలి. ఎవరెన్ని రకాలుగా మాట్లాడినా మన పద్ధతులు, పాలసీలు మనకంటూ ఉంటాయి కదా. అప్పుడే ఒక ప్రత్యేకమైన స్థానం మీకు దక్కుతుంది" అన్నది ఇందు మనోభావన. అయితే "జెంటిల్మన్ అంటే ఎవరు? ఇతరులెలా నిర్వచించినా... ఏ ఆకర్షణలకూ లొంగనివాడే నా దృష్టిలో జెంటిల్మన్... అలాంటిది స్మోకింగ్... డ్రింకింగ్ అలవాట్లున్నాయంటే అతను జెంటిల్మన్ ఎలా అవుతాడు..." అని తనదైన తరహాలో చెప్పిన రమతో చాలామంది అమ్మాయిలు ఏకీభవించారు. మరి అమ్మాయిల దృష్టిలో జెంటిల్మన్ అనిపించుకోవాలని మీకనిపించడం లేదా ఏంటి?!

✤



సినీ రచయిత
శ్రీ పరుచూరి గోపాలకృష్ణ
చెప్తోన్న కబుర్లు

చందు

పనికిరానన్ని పంపించేశారు

నేను వెళ్ళిన ఇంటర్వ్యూలో 'క్రియా పదంతో మొదలైందని మీరు చెప్పలేదు' అన్నారు. క్షమించాలి. 'అటచనిగాంచె...' క్రియా పదంతో మొదలు కాలేదండి. 'అట' అనేది వ్యర్థ పదం. 'చని', 'గాంచె' క్రియా పదాలు. 'ఆ ఒక్క పదం కాకపోయినా క్రియే కదా...' అన్నారు. క్రియా పదంతో ప్రారంభమవ్వడమంటే ఇది కాదండి. పెద్దలు మీరు అనుమతిస్తే క్రియా పదంతో మొదలైన వాటి గొప్పతనమేమిటో చెబుతానన్నాను. 'చెప్పండి. చెప్పండి...' అని విశ్వేశ్వరరావుగారు అంటున్నారు. ఇతను మా రాఘవయ్యగారి అబ్బాయి. ఈ కుర్రాణ్ణి 13 ఏళ్ళప్పుడు చూశాను. ఇంత పెద్దవాడయ్యాడని విశ్వేశ్వరరావుగారు మనసులో అనుకుంటూ అక్కడ కూర్చొని నన్ను ముద్దుగా చూసుకుంటున్నారు. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే నాలో ఉదయించిన 'సినిమా' ప్రశ్నకు సమాధానం రావడానికి. మొల్ల రామాయణాన్ని క్రియా పదానికి ఉదాహరణగా తీసుకున్నాను. రాముడు సీతాదేవి గురించిన విరహంతో ఉన్నాడు. ఆంజనేయుడు సీతాదేవిని వెదకడానికి వెళ్ళాడు. ఆ పరిస్థితి ఎంత భయంకరంగా ఉందంటే రాముడి శరీరంలోంచి వస్తున్న వేడికి ఋష్యమూక పర్వతం వేడెక్కిపోయి కోతులన్నీ వెచ్చగా సేద తీరుతున్నాయ్. అంటే అంత ఉడుకులో ఉన్నాడాయన. సీతను వెతకడానికి వెళ్ళి అలాంటి సమయంలో తిరిగొచ్చిన ఆంజనేయుడు ఏ పదం చెప్పాలి? 'సీత' అని చెబితే 'లేదా?' అని రాముడు చనిపోతాడేమో?! 'రావణాసురుడు' అంటే సీతని చంపేశాడా అనుకుని చనిపోతాడేమో రాముడు! 'లంక' అంటే లేదా సీత అని చనిపోతాడేమో! ఏం చెబితే రాముడు బతుకుతాడో అన్న ఆలోచన ఆంజనేయుడిది. అందువల్ల 'కంటిన్ జానకిన్...' అని మొదలుపెట్టాడు. 'చూశాను జానకిని' అన్నాడే కానీ 'జానకిని చూశాను' అనలేదు. ఇక్కడ 'కంటిన్' క్రియాపదమని చెప్పాను. అప్పటివరకు నేను సెలెక్ట్ అవ్వడం ఇష్టంలేని వర్గం కూడా మనస్ఫూర్తిగా బల్లలు చరుస్తూ ఆనందం వ్యక్తం చేసింది. ఇంటర్వ్యూ అయిపోయిన తర్వాత పత్తేపురం వెళ్ళడానికి బస్‌కోసం వెయిట్ చేస్తున్నా. నాతోపాటు ఇంటర్వ్యూ కోసం వచ్చిన ఒకావిడ నా వెనకాల ఉంది. మీరు ఇంటర్వ్యూ కోసం వచ్చారు కదా! మరి వెంటనే వచ్చేశారేంటి... ప్రశ్నలేవీ అడగలేదా? అనడిగితే 'నేనే ఒక మాట చెప్పేసి వచ్చేశానండి' అంది. ఏం చెప్పారమ్మా... 'మీ కళాశాలలో సిఫార్సులకు స్థానం లేకపోతే నాకన్నా ముందు ఇంటర్వ్యూ చేసినతనకి ఈ ఉద్యోగం ఇచ్చేయండి. నేను బయట కూర్చొని ఆయన చెప్పిన ప్రతి సమాధానమూ విన్నాను. ఆయన చెప్పిన సమాధానాల్లో ఒక్కటి కూడా నాకు తెలీదు. నన్ను ఇంటర్వ్యూ చేయడం అనవసరం' అని చెప్పి వచ్చేశానంది. ఏంటి ఇలాంటివాళ్ళు కూడా ఉంటారా అనిపించింది. అంటే ఇలా నిజాయితీగా మాట్లాడేవాళ్ళుంటారా అని!

ఈ కథంతా ఎందుకు చెప్పానంటే నేనా కళాశాలలో పాఠాలు చెబుతున్నప్పుడు పిల్లలు నా మాటలకు బల్లలు కొడుతూండేవాళ్ళు. అడుసుమిల్లి విశ్వేశ్వరరావుగారు ఓరోజు నన్ను పిలిచి 'మా అబ్బాయిలు(కుమార్, గోపాలకృష్ణ, వేణు) సినిమాలు తీస్తున్నారు. నువ్వు సినిమాకు పనికొస్తావురా' అని మొదటిసారిగా 'సినిమా' అన్న మాటను నా మెదడులోకి దూర్చారు. అంతేకాకుండా 1975 డిసెంబర్ 23వ తారీఖున ప్రొడ్యూసర్ ఎ.ఎల్. కుమార్ దగ్గరికి పంపించారు. ఈ నిర్మాత ఓ దర్శకుని దగ్గరకు తీసుకెళ్ళాడు. ఒక డైరెక్టర్‌గారు 'మీ భాష సినిమాలకు పనికిరాదు. పాండిత్యంలా ఉంది' అని పంపించేశారు. అయినా పట్టువదలకుండా విశ్వేశ్వరరావుగారు 1976లో నన్ను మద్రాస్ తీసికెళ్ళారు. అక్కడాయనికి(జి.సి శేఖర్) కూడా నేను నచ్చకపోవడంతో తిరుగు ప్రయాణం కట్టాను. 1977లో శివలింగేశ్వరరావు(మేం దర్శకత్వం వహించిన 'కాయ్ రాజా కాయ్' నిర్మాత) ఓ పెద్ద డైరెక్టర్‌కి కథ చెప్పించాడు. ఆయనక్కూడా ఆ కథ నచ్చకపోయేటప్పటికి తిరిగెళ్ళిపోయాం. మూడేళ్ళు తిప్పలుపడి 1978లో 'చలిచీమలు' చిత్రంతో ఎంటరయ్యాం.

శత్రువులు పెరగాలి.. కానీ మిత్రులు పెరిగారు

ఒక్కో జ్ఞాపకం ఒక్కో తీపి గుర్తు. 'మేజర్ చంద్రకాంత్' డబ్బింగ్ చెప్పిన అనంతరం మమ్మల్ని కౌగిలించుకుని 'మీకు మంచి పేరొస్తుంది' అని రామారావుగారనడం మర్చిపోలేం. 'ఆజాద్' చూసి అక్కినేని నాగేశ్వరరావుగారు రాత్రి పదిన్నరకు ఫోన్‌చేసి డైలాగ్స్‌ను పొగిడిన సంఘటన జీవితంలో మర్చిపోలేం. చిన్న రచయితలమైన మా మాట గౌరవించి 'ఈనాడు' చిత్రం చేసి 'ఏంటో మీ మాట విని చేశాను. ఇందులో ఫైట్లు లేవు, పాటల్లేవు, హీరోయిన్ లేదు.. ఏమవుతుందో ఈ సినిమా అని టెన్షన్ పడిన కృష్ణగారు మాతో కలిసి మార్నింగ్ షో చూసి, భుజంతట్టి 'నా 200వ సినిమా. గొప్ప సినిమా ఇచ్చారు' అన్న మాట మర్చిపోలేం. ఫస్ట్ షో 'సర్పయాగం' సినిమా చూసి శోభన్‌బాబుగారు ఫోన్‌చేసి మీరు సినిమా చేస్తానంటే ఈ క్షణంలో డేట్స్ ఇస్తానని ఆయనన్న మాటా మర్చిపోలేం. 'అసెంబ్లీ రౌడీ' సినిమా రిలీజైన అర్ధరాత్రి 12 గంటలకు తలుపుకొట్టి 'నేనివాళ నిజంగా హీరో అయ్యాను. ఈరోజునుండి మీరిద్దరినీ 'అగ్రజులు' అని పిలుస్తాను' అన్న మోహన్‌బాబు మాటలూ మర్చిపోలేం. మా దగ్గర డైరెక్ట్‌గా కథ వినకుండా క్యాసెట్‌లో విని, సినిమా చేసి 'ఖైదీ'తో మమ్మల్ని, కోదండరామిరెడ్డి, సలీం(డాన్స్ మాష్టారు) జీవితాల్ని మార్చేసిన చిరంజీవినీ మర్చిపోలేం. గురువుగారు అంటూ 'అనురాగ దేవత' నుంచి ఈనాటి వరకు ఒక గురుత్వాన్ని మాలో చూస్తున్నటువంటి మా బిడ్డ బాలయ్యను అస్సలు మర్చిపోలేం. 'పెదనాన్నా నాకు సినిమా రాయాలి' అని ఇంటికొచ్చి అడిగిన జూనియర్ ఎన్.టి.ఆర్.నీ మర్చిపోలేం. 'కృష్ణంరాజుగారు పెదనాన్న అయితే మీరూ నాకు పెదనాన్నలే' అని అన్న ప్రభాస్‌నీ మరచిపోగలమా! ఇవన్నీ జీవితంలో మధురమైన జ్ఞాపకాలు. ఇప్పటికి 300 సినిమాలు రాసేశామంటే శత్రువులు పెరగాలి. కానీ మిత్రులు పెరిగారు. జీవితంలో ఇంతకంటే సాధించేది ఏముంటుంది.

కార్మికుల అభ్యున్నతికి, పేదవాళ్ళ మేలు కోసం మేమెవరినన్నా కష్టపెట్టామేమో కానీ వ్యక్తిగతంగా, రచయితలుగా ఎవరినీ కష్టపెట్టలేదు. నిర్మాత ఇంకా మాకేమన్నా ఇవ్వాల్సి వచ్చినా ఆయన కష్టాల్ని చూస్తున్నాం కాబట్టి ఆ మొత్తాన్ని అడిగే వాళ్ళం కాదు. మా 304 సినిమాల చరిత్ర చూస్తే మాకు డబ్బులివ్వలేదని ఒక్క నిర్మాత మీద కూడా ఒత్తిడి తీసుకురాలేదు. ఇంతకంటే మిత్రత్వం ఏముంటుంది? రచయితకీ నిర్మాతకీ ఉండే అనుబంధం రచయితకీ - దర్శకుడికీ, రచయితకీ - ఆర్టిస్టుకుండే బంధం కంటే గొప్పది. శ్రీకారం చుట్టించుకునేది రచయితతోనే. శుభం చుట్టించుకునేదీ ఇతనితోనే. సెన్సార్‌కి వెళ్ళేదీ ఇతనే. పబ్లిసిటీ కూడా ఇతనితోనే రాయించుకుంటాడు. రచయితతో నిర్మాత అంత అనుబంధంతో ఉంటాడు. దీంతో నిర్మాత కష్టం రచయితకు అనుక్షణం తెలుస్తూంటుంది.

(ఇంకా వుంది)



మంట తగిలినా పగలని బూర

సాహిల్



ఫ్రెండ్స్! ముందు మేం ఓ ప్రశ్న అడుగుతాం సమాధానం చెప్పండి. వెలుగుతున్న కొవ్వొత్తి మీద బెలూన్ పెడితే ఏమవుతుంది? 'ఏంటా పిచ్చి ప్రశ్న?' అన్నట్టు చూస్తున్నారు నేస్తాలంతా. లుక్స్ తర్వాతగానీ... జవాబు చెప్పండర్రా! ఏమవుతుంది. ఆ... మీరన్నట్టు "టప్"మని పగిలిపోతుంది. కానీ ఓ గడుగ్గాయి మాత్రం పగలదంటున్నాడు. ఎలాగో ఏంటో చూద్దామా!

కావాల్సిన వస్తువులు

రెండు బూరలు, రెండు కొవ్వొత్తులు, కొంచెం నీళ్లు, కొద్దిగా దారం.

ఏం చెయ్యాలి?

ముందు ఒక బూరను ఊది మూతి దగ్గర దారంతో కట్టేయండి. తర్వాత రెండవ బూర తీసుకుని దాని లోపల పావు కప్పు నీళ్లు పొయ్యండి. తర్వాత బూరను ఊది మూతిని దారంతో కట్టేయండి. ఇప్పుడు రెండు కొవ్వొత్తులు వెలిగించి ... మెల్లగా ఒక్కో కొవ్వొత్తి మీద ఒక్కో బూర పెట్టండి. రెండిటికీ కొవ్వొత్తి మంట తగలాలి సుమా.

అప్పుడు ఏమౌతుంది?

మంట తాకగానే గాలి మాత్రమే ఊదిన బూర పగిలిపోతుంది. కానీ నీళ్లు పోసి గాలి ఊదిన బూర మాత్రం వెంటనే పగలదు.

ఎందుకని?

నీళ్లు మంచి ఉష్ణ గ్రాహకం కాబట్టే ఇలా జరిగింది. నీళ్లు వేడి కావాలంటే చాలా సమయం పడుతుంది. అందుకే ... నీళ్లు లేని బూరకు వేడి తగలగానే పగులుతుంది. కారణం రబ్బరు వేడిని భరించలేదు. కరిగిపోతుంది. మరి నీళ్లున్న బూర ఎందుకు పగలదు? ఎందుకంటే... బూరలోని నీళ్లు ఎక్కువశాతం వేడిని పీల్చుకుంటాయి. దాంతో రబ్బరు వేడి కాదు. అందుకే బూర వెంటనే పగలదు.

(మీరంతా ఈ ప్రయోగం చేసి చూడండి. అంతేకాదు. ఆ తర్వాత మీ నేస్తాలను అడిగి చూడండే.)

అచ్చంగా మా నేస్తాల కోసం
ఇకనుంచి
వారానికో
క్రిస్టమస్ క్రాఫ్ట్
(నేర్చుకుంటారుగా)

నింపేస్తేపోలా



ఫ్రెండ్స్! పైన కొన్ని జంతువులు, వస్తువులు వున్నాయి కదా. మీరు వాటి పేర్లను గళ్లలో రాయాలన్నమాట. ప్రయత్నించి చూడండి. తెలీకపోతే జవాబు చూడండే.

ఈత కొలనులో ఎవరబ్బా...





ఎవరి తోక ఏదో?





చెమట పట్టని
సూరీడు ఎక్కడబ్బా...



చూసి గీసేద్దాం



హాయ్ చిన్నారులూ...! పక్కన గళ్లల్లో ఓ బుజ్జి పక్షి వుంది. దాన్ని చూస్తే మీకు ఏం అనిపిస్తోంది? వెంటనే అలాంటి బొమ్మ గీయాలని కదూ. అందుకే కింద అలాంటి గడులే ఇచ్చాం. కాకపోతే మీరు పైన చూసి కింద బొమ్మ గియ్యాలి. ఓకేగదా.



నిధిని చేరేదెలా!



ఆ బుడతడు సముద్రంలో దాగిన నిధిని సొంతం చేసుకోవాలనుకుంటున్నాడు. మీరు కాస్త సాయం చేయొచ్చుకదా.

జవాబులు

వెమట పట్టని సూరీడు ఎక్కడబ్బా? మవైపు కింది నుంచి నాలుగో సూర్యుడు న్నాడుకదా. దానిపైన తిన్నగా మూడో ర్యుణ్ణి చూడండి.

నింపేస్తే పోలా! Across_1.pear jar 6.rat 7. man. own_1.pan 3.rope deer 5.ten.

తిత కొలనులో ఎవరబ్బా... పందిపిల్ల

ఎవరి తోక ఏదో? 1-సి, 2-ఎ, 3-డి, 4-బి.



అట్టమీది కథ

బెంజిమెన్ త్రిపురా



వెన్నెల మాసంలో
వనభోజనాలు
ప్రకృతి ఆరాధన...
స్నేహభావన
కార్తీక మాస చల్లటి
వాతావరణం
ఆహారం, ఆరోగ్యం,
ఆహ్లాదం, ఆనందం
వనం..జనం.. కలిసుంటేనే
వికాసం

వనం...జనం.. కలిసుంటేనే వికాసం

సృష్టిలో మార్పు ప్రకృతి ధర్మం. ప్రతి మార్పులోనూ ప్రకృతి మరింత రమణీయతను సంతరించుకుంటూ నిత్యనూతనమౌతుంది. ఆహారం, ఆరోగ్యం, ఆహ్లాదం, ఆనందం, ఆయుష్షును ఇలా ఎన్నింటినో అడక్కుండానే ప్రసాదిస్తోంది. అలా ఇస్తోందనే కృతజ్ఞతతోనే వివిధ రూపాలలో ప్రపంచంలో ప్రకృతిని ఆరాధిస్తారు. మన దేశంలో వెన్నెల మాసంలో వనభోజనాలు దానిలో భాగమే. సకల జీవరాశులకూ భూమిపై బతకటానికి హక్కుంది. ప్రకృతి చక్రంలో మానవాళికి సృష్టిలోని జీవరాశులకు సహసంబంధం ఉందంటారు పర్యావరణ శాస్త్రవేత్తలు. దక్షిణాయనం వర్ష రుతువులో వచ్చే ఆషాఢ, శ్రావణ, కార్తీక మాసాల్లో జనాలు వనాల్లోకి వెళ్లి తాము తినే ఆహారంలో తొలి ముద్దను జీవరాశులకు అర్పించి తమ మైత్రిని చాటుకోవటం ఆనవాయితీగా వస్తోంది. తరమేదైనా తలంపేదైనా ప్రకృతిని ఆరాధించే ఈ సంస్కృతి సంస్కారం కాలానుగుణ మార్పులతో జనావళిలో నిలిచుంది. ఈ తంతును గతంలో ఊరు, వాడ ఏకమై నిర్వహించుకునేవారు. కులం, బలం, బలగం, అభిమతం, పట్టణీకరణ కాలక్రమంలో దీన్ని మార్చాయి. అడవుల నుంచి హైటెక్ పార్కుల వరకూ వనభోనజాల విలాసాలుగా మారాయి.

మన కళ్లముందే కాలానుగుణంగా ప్రకృతి రూపు మార్చుకుంటుంది. వర్షరుతువులో ప్రకృతి పులకించి పరవళ్లు తొక్కుతుంది. వర్షాలు కురవడంతోనే క్రిమికీటకాలు వాటంతటవే జీవం పోసుకుంటాయి. పుడమి పులకించి సకల జీవరాశులకు జన్మనిస్తుంది. చెట్టుచేమలు చిగురించి, ప్రకృతి రమణీయతను మరింత శోభాయమానం చేస్తాయి. దక్షిణాయనంలోని ఆషాఢ, శ్రావణ, భాద్రపద, ఆశ్వయుజ మాసాల్లో ప్రకృతిలో మనుషులు మమేకం కావాలని ఆర్ష దార్శనికాలు సూచించాయి. నీరు, గాలి, అగ్ని, భూమి, ఆకాశం ప్రకృతి ప్రతిరూపాలు. ఆర్యులు రాకపూర్వమే భారతదేశంలో వనభోజన సాంప్రదాయం ఉంది. జీవరాశులు జన్మించే తరుణం ఆషాఢ, శ్రావణ, కార్తీక మాసాలు. ఇందుకోసం జీవసాంగత్యం పేరిట, బలిహరణం, తదితర ఆచారాల పేరిట వనాల్లో భోజనాలకు వెళ్లి, జీవరాసులకు ఆహారం వదిలేవారు. ఇలా చేయకపోతే వనాల్లో పుట్టిన క్రిమి కీటకాదులు ఆహారం కోసం జనావాసాలపై పడతాయని భయపడేవారు.

'మనిషి ఎక్కడినుంచి తనకు కావాల్సినవన్నీ పొందాడో, దానికే అంటే ప్రకృతికి తాను సంపాదించుకున్న దాంట్లో తనకు తోచిన రీతిన అర్పించటం న్యాయమని, దీన్ని విస్మరిస్తే అతను దొంగ అనే ధార్మిక వాదన ఒకటుంది. 'ఫలం, పుష్పం,

పత్రం, తోయం....' అనే శ్లోకం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. దీన్ని ఆధారం చేసుకునే ఆర్యులు సంస్కార, ఆచారాల్లో తమ ఆధిక్యతను నిలుపుకునేందుకు వన భోజనాలను కార్తీకానికి మార్చారు. భారతీయుల్లో ద్రవిడ, సింధు నాగరికతలు ఆషాఢ, శ్రావణ మాసాల్లో ఉద్భవించే జీవరాసులకు ఆహారం అందించటం అవసరమని భావించాయి. ఆర్యులు 'పుట్టి పెరిగిన వాటికి పాలన కూడా అవసరమే. ఇది సాటి జీవులుగా మన కర్తవ్యం. ప్రకృతి పరిపుష్టంగా వుంటేనే మనకు మనుగడ వుంటుంది' అని చెప్పారు.

ఆషాఢ, శ్రావణ మాసాలతో పాటు కార్తీక మాసంలో పూజావిధుల్లో తమ ఆధిక్యతను చాటుకునేందుకు శైవ, వైష్ణవులు పోటీపడ్డారు. దీని ఫలితంగానే హరి, హరులకు కార్తీకం ప్రీతిదాయకమైందనే కథలు ప్రచారంలోకి వచ్చాయి. మతాచార సాంప్రదాయాల మధ్య జరిగిన పోరాటాలు సమసిపోయినా వనభోజన సంస్కృతి మాత్రం నేటికి నిత్యనూతనంగా నిలిచి ఉంది. ఆషాఢ, శ్రావణ, కార్తీక మాసాలంటూ బేధం లేకుండా నేడు జనాలకు వనభోజనాలు ఆనవాయితీగా మారాయి. కాలచక్రంలోని 12 మాసాల్లో కార్తీక మాసంలో వెన్నెల వెలుగు అధికంగా ఉంటుంది. అందుకే కార్తీక మాసాన్ని వెన్నెలమాసమని, వెలుగుమాసమని పేర్కొంటారు.

వన భోజనాల వైశిష్ట్యం

పురాణాల ప్రకారం శివుడికి అత్యంత ఇష్టమైనది కార్తీక మాసమని, ఈ నెలలో లక్ష్మీనారాయణులు ఉసిరిక చెట్టు వద్ద ప్రగటితమయ్యారనే విశ్వాసం ప్రజల్లో ఉంది. అందుకే ఈ మాసంలో ఉసిరి చెట్టునీడన వంట చేసుకుని సహపంక్తి భోజనం చేస్తే సకల శుభాలు కలుగుతాయనే నమ్మకం ఒకటి ప్రబలింది. ఉసిరిలో ధాతు, లవణ, అమ్లాదులు పరిపూర్ణంగా ఉంటాయి. ప్రతిరోజూ ఒక ఉసిరిని సేవిస్తే రోగాలు దరిచేరవని ఆయుర్వేద, చరక సంహితలు చెప్పాయి. ఇందుకే కార్తీక మాసంలోని పౌర్ణమిని ఉసిరిక పౌర్ణమి అనికూడా అంటారు. అయితే ఏడాది పొడవునా ఉసిరిని తినలేనివారు కనీసం కార్తీకమాసంలో ఈ చెట్టుకింద 12గంటల పాటు గడపడం వల్ల అక్కడున్న వాతావరణ ప్రభావంతో వ్యాధి నిరోధక శక్తి లభిస్తుందనే భావన మూఢనమ్మకం తప్ప మరొకటి కాదు.

శరదృతువు మంచుకురిసే ఈ సమయంలో ఉసిరి చెట్టు కింద మంటలు వేయటం శ్రేష్టమనే విశ్వాసమే వనభోజనాలకు పురిగొలిపిందనే వాదనా ఉంది. ఇక పురాణ కథల్లోకి వెళ్తే 'ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడు అబాలగోపాలం, పశుసందతో వనాల్లో ఆనందంగా ఉండటాన్ని చూసి అసూయపడి వాటిని అఘాసురుడు మింగేస్తాడు. కృష్ణుడు రాక్షసుడిని చంపి వాటిని రక్షించిన తర్వాత ఆవుల మంద, గోపబాలలతో కలిసి నదీ తీరంలోకి వస్తాడు. అపుడు ప్రకృతి రమణీయతను చూసి పులకించి వాటిని గురించి తన వాళ్లకు వివరించాడని, రమణీయంగా ఎన్నో ప్రయోజనాలు కలిగిస్తున్న ప్రకృతిని ఆరాధించమని యాదవులను ఆదేశించినట్లు' శ్రీమద్భాగవతం పేర్కొంటోంది. అంతేకాకుండా 'నదీతీరంలో ఆకలిగొన్న గోపబాలలు తమ వద్ద ఉన్న ఆహారాన్ని మైత్రి భావంతో పరస్పరం పంచుకుని తిని ఆనందపడడం... ఆ తర్వాత మైమరచి ఆటపాటల్లో తేలిపోయిన తీరే వనభోజనాలకు మూలమనీ' ఉంది.

ఉత్తర భారత దేశంలోని పలుప్రాంతాల్లో ఆచరిస్తున్న వనభోజనాలు ఇందుకు నిదర్శనం అన్నట్లుంటాయి. అయితే కొంత తేడా ఉన్నా ఇజ్రాయెల్, రోమ్ ప్రాంతాల్లో ఇదే మాసంలో క్రైస్తవులు వనభోజనాలకు వెళ్లడమనే ఆచారం ఉంది. రోములో ఈస్టర్ పండగ సమయంలో క్రైస్తవ కుటుంబాలు ఉదయాన్నే వంట పాత్రలు, తినుబండారాలతో పచ్చని పచ్చిక బయళ్లలోకి, లేదా వనాల్లోకి వెళ్లి అక్కడే వంట చేసుకుని తింటారు. చల్లని వాతావరణంలో ఆ రోజంతా గడిపి రాత్రి ఏడుగంటల సమయానికి ఇల్లు చేరుకుంటారు. ఇందులో చర్చిల వారిగా వేళ్లే సాంప్రదాయం గతంలో ఉండేది. క్రైస్తవంలో క్యాథలిక్, ప్రొటెస్టంట్ల మధ్య విభేదాల వల్ల చర్చిలు వీటిని ఆచరించేందుకు సాహసించటం లేదు.

హైటెక్ వనభోజనాలు

ఇదంతా గతమైతే తిరోగమన, పురోగమనాలతో నేటి వనభోజన సంస్కృతి కొత్త పుంతలు తొక్కుతోంది. కార్తీక మాసంలో జరిగే వనభోజనాలకు హైటెక్ తోడైంది. ఇంట్లోంచి వంటపాత్రలు, నానా సరంజామాతో వనాల్లోకి వెళ్లడం నాటి సాంప్రదాయమైతే, ఇవేవి లేకుండా డబ్బుకట్టి దర్జాగా సహపంక్తి భోజనాల్లో పాల్గొనే అవకాశాలను నేటి కార్పొరేట్ సంస్థలు కల్పిస్తున్నాయి. రిసార్ట్స్, కార్పొరేట్ సంస్థలతో పాటు ప్రభుత్వరంగ సంస్థలు ఈ అవకాశాన్ని సొమ్ము చేసుకునేందుకు ప్రత్యేక రాయితీ టారిఫ్‌లతో సిద్ధమయ్యాయి. హైదరాబాద్ నగరం విషయానికొస్తే అడవులు, పంట పొలాలు కనిపించవు. అందుకే ఇక్కడుండే జూలాజికల్ పార్కు, శిల్పారామం, ఇందిరా , సంజీవయ్య, లుంబినీ, ఎన్టీఆర్ పార్కులు, ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్ యూనివర్సిటీ, గండిపేటలకు తరలి వెళ్తారు.

ప్రత్యేక ధరలు

శిల్పారామంలో 2004 నవంబర్ 13వ తేదీ నుంచి డిసెంబర్ 5వ తేదీ వరకూ టూరిజం శాఖ నిర్వహించిన కార్తీక వనభోజనాలకు పిల్లలకు 50 రూపాయలు, పెద్దలకు 100 రూపాయల చొప్పున వసూలు చేసింది. అయితే ఈ ఏడాది అక్టోబర్ 23 నుంచి నవంబర్ 20 తేదీల్లో నిర్వహిస్తోన్న కార్తీక సమారాధన ధర పెరిగింది. ఈ శాఖ ప్రస్తుతం 150 రూపాయల వరకూ వసూలు చేస్తోంది. కార్తీక వనభోజనాలను నిర్వహిస్తోన్న రిసార్టులు ఉదయం అల్పాహారం,



మధ్యాహ్నం మృష్టాన్నభోజనం, సాయంత్రం స్నాక్స్ ఇచ్చే విధంగా టారిఫ్‌లు రూపొం దించాయి.

వీటితో పాటు ఆబాలగోపాలాన్ని అలరించే విధంగా బోటింగ్, స్కేటింగ్, ఇతర ఆటలు ఆడుకునేందుకు అవకాశం కల్పిస్తున్నాయి. తెలుగు వంటకాలైన బూరెలు, గారెలు, ఏదైనా స్వీటు, పులిహోర, వరి అన్నం, రసం, సాంబారు, గొంగూర, ఆవకాయ, పునుగులు, పెసరబూరెలు, అరిసెలు వంటి అనేక వంటకాలను ఈ భోజనాల్లో వడ్డిస్తున్నారు. ఆటపాటలతో కూడిన వినోదం ఇందులో ముఖ్యపాత్ర వహిస్తోంది. లాటరీ పద్ధతిన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నాయి.

ఇద్దరు పిల్లలు, ఇద్దరు పెద్దలతోకూడిన కుటుంబానికి 350 నుంచి 400 వందల రూపాయల వరకూ ఇందుగ్గానూ వసూలు చేస్తున్నాయి. ఒక వ్యక్తికి 150 రూపాయలు వసూలు చేస్తున్నాయి. మన రాష్ట్రంలో హైదరాబాద్, విశాఖ పట్నం, విజయవాడ, తిరుపతి, గుంటూరు ప్రాంతాల్లో పర్యాటకశాఖ కార్తీక సమారాధన ఏర్పాట్లు చేసింది. హైదరాబాద్‌లోని శిల్పారామం (ఫోన్ నెంబర్: 65541820), ప్రగతి రిసార్ట్స్ (ఫోన్ నెంబర్: 9848090180), స్ప్రింగ్ లాండ్ రిసార్ట్స్(ఫోన్ నెంబర్: 9866461810), ప్లాసిడా రిసార్ట్స్ (ఫోన్ నెంబర్: 9849550056), శ్రీనిధి రిసార్ట్స్ (ఫోన్ నెంబర్: 27170667), లియో రిసార్ట్స్ (ఫోన్‌నెంబర్: 9849627772) ఇంకా అనేక కులసంఘాలు, ఇండియన్ తెలుగు పీపుల్స్ అసోసియేషన్ ఇలా ఎన్నో సంస్థలు తమదైన ప్రత్యేక తరహాలో కార్తీక వనభోజనాలను ఏర్పాటు చేస్తున్నాయి.

కలవమంటున్న వనభోజనాలు... విడగొడుతున్న అసమానతలు

గ్రామీణ ప్రాంతాల్లో వనభోజనాలకు వెళ్లడమంటే ఆరోజు ఊరంతటికి పండుగే. వాడవాడనున్న ప్రజలు బండ్లు కట్టుకుని పిల్లాపాపలతో వంటపాత్రలను, సరుకులను తీసికెళ్ళి ఊరికి చేరువలోనున్న వనాల్లోకి వెళ్లేవారు. ఇందుకోసం గ్రామ పెద్ద ముందుగానే డప్పు చాటింపు వేయించేవారు. కొన్ని గ్రామాల్లో ఈ క్రమం ఇప్పటికీ సాగుతోంది. అయితే కుల, వర్గ, సామాజిక, ఆర్థిక అసమానతలు నానాటికీ పెరుగుతూ వనభోజన సంస్కృతిపై ప్రభావం చూపుతున్నాయి. ఉమ్మడి కుటుంబాలుండే ఊళ్లలోనూ వైషమ్యాల కారణంగా వనభోజనాలకు వెళ్లే వ్యవహారంలో కూటములుగా ఏర్పడుతున్నారు. జనాభా పెరుగుదల, పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, ప్రపంచీకరణ ధాటికి పల్లెలు పట్టణాలుగా, పెద్ద పట్టణాలు మహానగరాలుగా మారాయి. ఒక కుటుంబం వారి మిత్రులతో కలిసి పోవటం వరకూ వన భోజనాల సంస్కృతి కుచించుకు పోయింది.

అయితే రాజకీయ ప్రయోజనాల దృష్ట్యా వనభోజనాల్లో వర్గ దృష్టి విపరీతంగా పెరిగింది. కుల ప్రాతిపదికన జనాన్ని సమీకరించు కునేందుకు రాజకీయపార్టీలు వనభోజనాలను వేదికగా చేసుకుం టున్నాయి. కుల సంఘాలను ప్రోత్సహించి ఆయా కులాల్లోని వారిని వన భోజనాల పేరిట ఆకర్షిస్తున్నాయి. వెరసి వనభోజనాలకు సామూహికంగా వెళ్లవలసిన వారు పుట్టకో గుంపు, గుట్టకో గుంపుగా విడి పోతున్నారు. నిరాహారం, సమాహారం, ఉపాహారం వంటి నియమాలతో ప్రజలు కార్తీక మాసంలో మితభోజనం తీసుకోవాలని, మాంసాహారాలను వదిలిపెట్టాలని కోరుకుంటారు. శరీరానికి పని తక్కువగా ఉన్నపుడు సేవించటం సరికాదనే నెపంతో మాంసాహారాన్ని తినటం ఈ రోజుల్లో పూర్తిగా మానేస్తారు. కొందరు ఈ రోజుల్లో జీవహింస చేయకుండా ఉండాలనే సంకల్పంతో మాంసాహారాన్ని తినకుండా సాత్విక చింతనతో వ్యవహరిస్తారు. అయితే వనభోజనాల్లో మాంసాహారాన్ని వడ్డించటం కార్తీక మాసంలో అవి తినకూడదనుకునేవారిని బాధిస్తోంది.

ప్రకృతిలో సమతుల్యాన్ని కాపాడేందుకు మైత్రి భావమే మంచి మార్గం. తరచూ వనాల్లో భుజించటం, సంచరించటం వల్ల మొక్కలు, మనుషుల మధ్య ఆత్మీయత పెరుగుతుంది. వనాలు, జీవులకు రక్షణ కల్పించాలనే ఆకాంక్ష సుహృద్భావం పెరుగుతుంది. వనాలు వృద్ధి చెందుతాయి. వర్షాలు సకాలంలో కురుస్తాయి. కాలుష్యం తగ్గుతుంది. వనాలను కాపాడాలని ప్రభుత్వమూ చెవిలో ఇల్లు కట్టుకుని చెబుతోంది. వీటి పరిరక్షణకోసం కొత్త చట్టాలను రూపొందిస్తోంది. అందుకే వనం...జనం.. కలిసుంటేనే వికాసం. ✤



ఆరోగ్యం

డాక్టర్ చంద్రభూషణ్,
కన్సల్టెంట్ ఆర్థోపెడిషియన్,
హైదరాబాద్.

కీళ్లు ఎందుకు అరుగుతాయి?

మనిషికి ఓ ఆకారాన్నిచ్చేవి ఎముకలు. కదలికలకు తోడ్పడేవి కీళ్లు, కండరాలు. ఎముకలు కలిసేచోటునే కీళ్లు అంటారనే విషయం అందరికీ తెలిసిందే. ఈ కీళ్ల వల్ల మనం రకరకాలుగా వంపులు తిరుగుతున్నాం. మన కదలికలకు ఇవి తోడ్పడతాయి. ఎక్కువగా, అనవసరంగా శ్రమించడం వల్ల కీళ్లు త్వరగా అరిగిపోతాయి. ఇలా కీళ్లు అరిగితే అనేక సమస్యలు తలెత్తుతాయి. కీళ్లలోని కార్టిలేజ్ పొర దెబ్బతినడం వల్ల ఆర్థ్రైటిస్ వస్తుంది. నలభై శాతం కేసుల్లో నలభై ఏళ్లు దాటిన మహిళల్లో ఆర్థ్రైటిస్ ప్రారంభమవుతుంది.

ఆర్థ్రైటిస్ కారణాలు

1) కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు జరగడంవల్ల.
2) జాగింగ్ ఎక్కువగా చేయడం.
3) స్థూలకాయం కారణంగా.
4) ఎక్కువసార్లు కింద కూర్చుని లేస్తుండటం.
5) మోకాలు కీలు విరిగి ఇన్‌ఫెక్షన్ వల్ల క్షయ, సెప్టిక్ ఆర్థ్రైటిస్ వస్తుంది.
6) వయసు మీరిన మహిళల్లో
7) కొవ్వు ఎక్కువ పేరుకుపోవడం.

ఆర్థ్రైటిస్ వ్యాధి వచ్చిన వాళ్లల్లో హార్మోన్ల సమతుల్యం లేకపోవడం, బోన్‌మెటబాలిజమ్, ఎక్కువసేపు కింద కూర్చోవడం, పొట్టిగా, లావుగా ఉండడం ప్రధానకారణాలు కాబట్టి ఈ విషయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రారంభ దశలో కీళ్ల దగ్గర నొప్పి, నడుస్తుంటే కిర్‌కిర్ అనే శబ్దాలు వస్తుంటాయి. కింద కూర్చుని లేచేటప్పుడు బాధగా అనిపిస్తుంది. క్రమంగా కీళ్లు దెబ్బతిని మోకాలి వెనుక తేలికగా ఉంటుంది. కదలికలు మామూలుగా తేలికగా ఉండవు.

చటుక్కున లేస్తే కీళ్ల దగ్గర బాగా నొప్పి వస్తుంది. కీళ్లలో కార్టిలేజ్ చిన్న చిన్న ముక్కలుగా విరిగి లూజ్ బాడీస్ ఏర్పడి కీలు లాక్ అవుతుంది. కదలికలు స్పష్టంగా ఉంటాయి. ఒక్కోసారి నడుస్తే జారిపోయినట్లు అనిపిస్తుంది. మోకాలిచిప్ప వెనుక నొప్పి వస్తుంది. టాయిలెట్‌కు వెళ్ళినప్పుడు, నేల మీద కూర్చుని భోజనం చేస్తున్నప్పుడు, కింద కూర్చుని ఎక్కువసేపు పనిచేసేవాళ్లకి బాధ ఎక్కువగా ఉంటుంది. మెట్లు ఎక్కినా, కార్టిలేజ్ విరిగినా ఈ నొప్పి వస్తుంది. ఈ సమస్యలవల్ల మోకాళ్ళను తిన్నగా ఉంచాలన్నా ఉంచలేం. కాళ్లు వంకరగా ఉంటాయి. కింద బాసిపట్లు వేసుకుని కూర్చోవడం, మోకాళ్ళమీద కూర్చోవడం మంచిది కాదు. మెట్లు ఎక్కకూడదు. సర్జరీ వల్ల ప్రయోజనం ఉన్నప్పటికీ బరువు తగ్గాలి. మందులు, వ్యాయామాల వల్ల ఏ వైపున నొప్పి ఉంటే ఆ వైపు చేతికర్రను వాడాలి. దీంతో ఆ భాగంపై ఎక్కువ బరువు పడకుండా చూడాలి. వృద్ధాప్యంలో హైటిబియల్ ఆస్టియోటమి లేదా ఆర్థ్రోసిస్ చేస్తారు. నొప్పి తగ్గుతుంది కాని నడవడం కష్టమవుతుంది. ఆర్థ్రోసిస్ కాకుంటే పూర్తిగా మోకాలి కీలు మార్పిడి చేయాలి. ✤





కథ

కన్నడ మూలం : సారా అబూబకర్

అనువాదం : డా. దేవరాజు మహారాజు

జననం

గత రెండు రోజులుగా ఖతీజా పురుటి నొప్పులతో బాధపడుతోంది. అయినా ప్రసవమయ్యే సూచనలే లేవు. వీలయినంతవరకు బాధను ఓర్చుకుంటోంది. ఒక్కోసారి ఓర్చుకోలేక కేకలేస్తోంది. ఎవరైనా వింటారేమోనని తనను తాను నిగ్రహించుకుంటూ బాధను అదిమిపెట్టుకుంటోంది. మధ్యమధ్యలో 'యా అల్లా' అంటూ పళ్లు బిగబడుతోంది.

"నొప్పి లేకుండా పిల్ల ఎట్లా పుడుతుందమ్మా?" అంటూ పక్కనే ఉన్న మంత్రసాని ఖతీజాని ఓదార్చుతోంది. ఓదార్చుతోందేగానీ ఆమెకూడా ఆందోళన పడుతూనే ఉంది. అందుకు ఆమె నొసటిమీద ఉన్న ముడతలే సాక్ష్యం! ఆమె ఆ ఊరి మంత్రసాని. ఇలాంటి ప్రసవాలెన్నో చేసింది. ఇలాంటి బాధలెన్నో చూసింది. ఒక శిశువు పుట్టుకలో ఎంత సంఘర్షణ ఉందో, ఎంత వేదన ఉందో, ఎంత నొప్పి ఉందో శారీరకంగా ఎంత హింసపడాలో ఆమెకు తెలుసు.

అంత బాధలోనూ ఖతీజాకు ఉత్కంఠగానూ ఉంది. తను ఒక శిశువుకు జన్మనివ్వగలనా అని. ఈ నొప్పి ఇప్పుడే ప్రారంభమైంది కాదు. చాలా కాలం కిందటే ప్రారంభమైంది. ఆరోజు ఆమెకు గుర్తుంది.

ఖతీజా నాలుగో తరగతి పాసై ఐదోతరగతిలోకి వెళ్తున్నప్పుడు ఆమెకు పదకొండేళ్లు. అప్పుడే ఇంట్లోవాళ్లు ఆమె చదువు మాన్పించారు. తెలివిగలపిల్ల బడిమానేసిందేమని పాఠశాల ఉపాధ్యాయులు అనుకున్నారు. ఓరోజు వాళ్ల ఉపాధ్యాయిని ఖతీజాను వెతుక్కుంటూ వచ్చింది.

"చూడమ్మా! నీ కూతురు తెలివైన పిల్ల. క్లాసులో ఎప్పుడూ ఆమెదే ప్రథమస్థానం. చదివిస్తే ఆమె భవిష్యత్తు బ్రహ్మాండంగా...."

ఆవిడ మాట పూర్తి చేయకముందే ఖతీజా తల్లి అందుకుని "పంతులమ్మగారూ నిజమేనండీ, కాని ఆడపిల్ల చదివేం చేయాలి? ఉళ్లేలాలా, ఉద్యోగాలు చేయాలా? ఈ సంవత్సరం దానికి పెళ్లి చేయాల్సి ఉంది. ఇంతవరకు ఇంటి పనులు నేర్చుకోలేదు. బడికి పంపుతూంటే, ఇంటి పనులు ఎలా నేర్చుకుంటుంది చెప్పండి?"

వాళ్ల సంభాషణ విన్న ఖతీజాకు గుండెలో రాయిపడింది. ముఖం కందగడ్డలా ఎరుపెక్కింది. ఉక్రోషం పొంగు కొచ్చింది. కోపంగా ఇంట్లోకి పరుగుతీసింది. బళ్లో ఆటాపాటా, కథలు, పాఠాలు, నవ్వులు లేకుండా ఇక తన రోజులు గడవనున్నాయని అనుకోవడమే భారంగా తోచింది.

పెళ్లినాటికి ఆమెకు పదమూడేళ్ళు. కళ్లనిండా కలలు నింపుకున్న ఆనందం. అరచేతిలో గోరింటాకుతో పెళ్లి సంబరాన్ని చాటడం ఆమెకింకా గుర్తే. అదొక మధురోహ. కాని... కలలు కలలుగానే ఉండిపోయాయి. కుర్ర మనసు కువకువలన్నీ భ్రమలేనని తేలిపోయింది. కలల్ని వాస్తవాలుగా మలచుకునే అవకాశం ఆమెకు రాలేదు. భర్త ఆమెకన్నా వయసులో చాలా పెద్దవాడు. పుప్పొడిని బలవంతంగా దోచుకునే తేనెటీగలాంటివాడు. పూవు అందమెంత, సున్నితత్వమెంత, సువాసనెంత అనే విషయాలేవీ తెలియనివాడు. పువ్వుకు కూడా తనదైన ఒక ప్రపంచం ఉంటుందని గ్రహించనివాడు. పువ్వు కేవలం ఆఘ్రాణించడానికేనని అనుకునేవాడు. అందుకే అతను నిరంకుశుడయ్యాడు. దెబ్బ మీద దెబ్బ... బాధ మీద బాధ... విషాదనిర్వేదాల నీడలు ఈసారి ఆమె ముఖం మీద పరచుకున్నాయి. ఆమె ఆంతర్యంలోని ఆందోళన, ఆవేదనలను ఆమె తల్లికూడా అందుకోలేక పోవడం మహావిషాదం.

"మగాళ్లంతా ఒకటేనమ్మా! ఏంటీ? నీ భర్త నీ కన్నా కాస్త పెద్దవాడు. అయితే మాత్రం కొంపలేం మునిగిపోవు. ఆడదానికి కావల్సింది ఇంత తిండి, ఇంత గుడ్డ, నీకు ఆ రెండూ పుష్కలంగా దొరుకుతాయి. అతన్నీకేమీ లోటు చేయడు. ఏమంటావ్?" అంది.

తల్లిమాటలు విన్న తర్వాత కూడా, ఆమె ముఖంలో బాధ తాలూకు గుర్తులు అలాగే ఉండి పోయాయి. అన్ని బాధల్ని ముంచేస్తూ కాలం మూడేళ్ళు ముందుకు నడిచింది. ఈసారి బాధ తీవ్రంగా. అనూహ్యంగా వెన్నుపూసను వణికిస్తూ వచ్చింది.

ఆరోజు... నెలసరి రాలేదు. ఆమెలో ఏదో ఆశ తొంగిచూసింది. భర్త పడకగదిలోకి వచ్చేసరికి ఆమె విడిగా పడుకుంది.

"ఏదీ... నీకు కడుపొచ్చే సూచనలే లేవు" అన్నాడు వెటకారంగా.

"అది నా తప్పా?" అంది ఖతీజా సన్నని గొంతు పెగుల్చుకుని.

"అంటే ఏమిటి నీ ఉదేశం? తప్పు నాదనా?" అతని గొంతులోని మాట అరుపులాగా బయటపడింది. ఆమె మాట్లాడలేదు. మౌనమే సమాధానమనుకుంది.

"చూడూ, సంవత్సరం తిరిగేలోగా నాకో కొడుకు కావాలి. ఇక నేను ఎదురుచూడలేను" ఆజ్ఞాపించాడతను. ఆమె నిలువునా కంపించిపోయింది. సంవత్సరం తిరిగేలోగా బిడ్డకు జన్మనివ్వాలా? కానీ ఎలా? ఆమె తల్లిదగ్గరికెళ్లి గోడు వెళ్లబోసుకుంది. ఆ తల్లి, దొరికిన నాటు మందులన్నీ ఇప్పించింది. అయినా కడుపు పండలేదు. సంవత్సరం గడిచిపోయింది. బిడ్డ పుడితే ఎలా పెంచి పోషించాలి అనేది ఆలోచిస్తూ ఓరోజు సాయంత్రం ఇంటి వసారాలో కూర్చున్నప్పుడు ఆమె భర్త సూట్‌కేస్ తీసుకుని ఇంట్లో కొచ్చాడు. భర్తకు టీ పెడదామని ఆమె లేచి ఇంట్లోకి వెళ్లబోయింది. అంతే కళ్లు గిర్రున తిరిగాయి. భర్తను అనుసరిస్తూ ఆయన వెనక ఓ స్త్రీ వచ్చింది. ఆమె పెళ్లికూతురిలా అలంకరించుకుని ఉంది. ఆ దృశ్యం చూడగానే ఆమె గుండెల్లో గునపం గుచ్చుకున్నట్లయింది. ఏదో భయం. ఎవరీమె? ఎందుకు తనభర్త వెంట వచ్చిందీ? ఆ వచ్చింది ఎవరని అడిగే హక్కు ఖతీజాకు లేదు. ధైర్యం అంతకన్నా లేదు. అయోమయంగా భర్తను చూసింది.

"ఏంటీ గుడ్లప్పగించి అలా చూస్తున్నావ్? నీకెలాగూ పిల్లలు పుట్టరు. నాకు ఓపిక నశించింది. అందుకే దీన్ని పెళ్లి చేసుకున్నాను" అని కొత్త పెళ్లి కూతురివైపు చూసుకున్నాడు. దుఃఖంలో కూరుకుపోవడంవల్ల పెద్దగా అరవాలనుకున్నా గొంతు పెగల్లేదు. మూర్ఛవచ్చి పడిపోయినట్లయింది.

నొప్పి.. ఎక్కడినుంచి ఎక్కడికి పాకిన నొప్పి ఇదీ? "అబ్బా!" మంత్రసాని చనువుగా నుదుటిమీద చేయి వేసి "బేటీ, ఇంకా సమయం రాలేదు.

కంగారుపడకు. కొంచెం ఓపిక పట్టు" అంది.

ఓరోజు అతను ఖతీజాను పిలిచి "నీకు నేను చేయించిన బంగారు నెక్‌లెస్ ఉండాలి కదా? అది ఆయేషా కివ్వు" అన్నాడు.

"ఊ... అది నాది, నేనెందుకిస్తాను?" అని మొదటిసారి ఆమె నోరు విప్పిందోలేదో చెంప చెళ్లుమంది. నక్షత్రాలు కనిపించాయి.

"చెప్పినట్లు చేయ్. లేదా నీ తల్లిదగ్గరకి ఫో... అంతే" భర్త గద్దింపు వినిపించింది. తల్లిదగ్గరికా? దుర్భరం! తండ్రి లేనిచోట అన్నదమ్ముల పెత్తనం సాగుతున్న చోట ఎలా ఉంటుంది బతుకు? అదీ నరకమే.

ఆయేషాకు పిల్లలు పుట్టారు. తనకు పుట్టిన పిల్లలు కాకపోతే మాత్రం ఏమిటి? ఒకరకంగా వాళ్లు ఈమె జీవితంలో కూడా ఒకింత సంతోషం తెచ్చారు. ఆయేషా పురుడు పోసుకోవడానికి వెళ్లినప్పుడల్లా భర్త తనను వెతుక్కుంటూ ఉండేవాడు. అంతదాకా తనను అశ్రద్ధచేసిన, హేళనచేసిన, చులకన చేసిన సంగతి, అవమానపరుస్తూ ప్రవర్తించిన విషయం అన్నీ మెదడులో తాజాగానే ఉండేవి. కానీ ఏం చేస్తుంది? అతను కావాలని దగ్గరికొచ్చినప్పుడు అన్నీ మరిచి సహకరించాలి. తప్పదు. ఆ నొప్పి చాలా బాధాకరం. దాన్ని ఎవరూ అర్థం చేసుకోలేరు. ఆమె ఆ నొప్పిని భరించింది. ఫలితంగా ఎక్కడో ఒకింత మెరుపు మెరిసింది. వికారం, వాంతులు మొదలయ్యాయి. ఆమెకు కడుపొస్తుందేమో, పిల్లల్ని కంటుందేమోనని ఆయేషా అనుమానపడింది. అసూయపడింది. క్రమంగా ఆమెలో ఈర్ష్య పెరిగింది.

"మూర్ఖుడు. ఒక్క రెండేళ్లు ఓపిక పట్టలేకపోయాడు" అనుకున్నప్పుడు ఖతీజా నొప్పి మరింత కలుక్కుమంది.

ఆయేషాకు ఏడుగురు పిల్లలు పుట్టేసరికి ; ఖతీజా ముగ్గురు పిల్లల తల్లయింది. కుటుంబం పెరిగింది. సమస్యలు పెరిగాయి. ఓరోజు ఖతీజాను పిలిచి ఆమె భర్త "మీ అబ్బా జాన్ చనిపోగానే మీ భాయిలోగ్ ఆస్తి పంచుకున్నారు. నీకు మాత్రం ఏమీ ఇవ్వలేదు. ఫో.. పోయి పోట్లాడి నీ భాగం నువ్వు తెచ్చుకో" అని సూచించాడు.

"మేం నీకు పెళ్లి చేయలేదా? బంగారం పెట్టలేదా? అనుకున్న వరకట్నం ఇవ్వలేదా? ఏం చెయ్యలేదు? మీ ఆడపిల్లలందరికీ పెళ్లిళ్లు చేసి పంపించేసరికి మాకేం మిగిలింది? ఒక చిన్న షాపు! అందులోనూ ఇప్పుడు భాగం కావాలంటున్నాడా నీ భర్త? మేమంతా ధనవంతుల్లాగా కనిపిస్తున్నామా ఆయన కళ్లకూ? నువ్వెప్పుడొచ్చి అడిగితే అప్పుడు మూటగట్టి ఇవ్వడానికి ఇక్కడేముందనీ? సిగ్గూశరమూ ఉన్న మనిషేనా అతను? ఇంకో నలుగుర్ని పెళ్లి చేసుకోమని చెప్పు. అందరి దగ్గర్నించీ ఆస్తిలో భాగాలొస్తాయి. నిన్ను బాగా చూసుకుంటున్నాడనా? ఎందుకివ్వాలి అతనికి డబ్బు? నిన్నెంత క్షోభ పెడుతున్నాడో మాకు తెలీదా? ఏమీ చేయలేక నోరు మూసుకున్నాం గానీ... అసలు అతను మనిషేనా?" అంటూ గొడవ చేశారు అన్నదమ్ములు.

అక్కడి విషయాలన్నీ ఖతీజా భర్తకు చెప్పింది. అతను అగ్గిమీద గుగ్గిలమయ్యాడు. "మీ వాళ్లు అలా అన్నారా? సరే నువ్వీక పుట్టింటి ముఖం చూడకూడదు. పొరబాటున ఎప్పుడైనా వెళ్లావా? అంతే తలాక్ అయిపోయినట్లే ఇక మాట్లాడొద్దు. బస్ ఖతమ్" అన్నాడు.

భర్త ఆజ్ఞ భగవంతుడి ఆజ్ఞలాంటిది.. కాదంటారా?

"నొప్పి.. నొప్పి.. ఓరి భగవంతుడా ఎందుకు నాకిన్ని బాధలు?"

"కొంచెం ఓపిక పట్టు ఈసారి నొప్పులకు తప్పక ప్రసవిస్తావు" అంది మంత్రసాని.

"తప్పక ఛస్తావు" అన్నట్టు వినబడింది ఖతీజాకు.

నాలుగేళ్లు గడిచాయి. ఖతీజా తన తల్లి, తోబుట్టువుల్ని చూడక. పోయినసారి పురుడొచ్చినప్పుడు ఎన్నో సమస్యలు ఎదురయ్యాయి. మంత్రసానివల్ల కాన్పుకాలేదు. ఆసుపత్రికి తరలించారు. అప్పుడు కూడా తన తల్లికి కబురు చేయలేదు. ఆమె రాలేదు. ఎవరిద్వారానో సమాచారం తెలుసున్న ఆ తల్లి ఖతీజా చిన్ననాటి స్నేహితురాలు ఏసమ్మతో మందులు పంపింది. అది తెలుసుకున్న భర్త వాటిని కసికొద్దీ చెత్తకుప్పలో పడేశారు. ఖతీజా కాసేపు ఏడ్చింది. అంతకన్నా ఏం చేస్తుంది?

ఈ నొప్పి కన్నీళ్లుగా కళ్లవెంటే ఎందుకు కారిపోతోంది? గొంతులోంచి ఎందుకు పెగలడం లేదు?

నా శవాన్ని చూడడానికైనా వస్తారు. వాళ్లతో నువ్వు వెళ్లిపో... ఇక్కడ ఉండమని ఎవరైనా చెప్పినా వినకు. బాగా చదువుకుని నీ కాళ్ల మీద నువ్వు నిలబడు" ఆ మాటలు చెబుతున్నప్పుడు ఖతీజా కన్నీళ్లు ఆపుకోలేకపోయింది. సుమయ్యా తల్లి కన్నీళ్లు చూడలేక తన చిట్టి చేతులతో తుడిచింది.

ఓరోజు ఏసమ్మ మళ్లీ వచ్చింది. ఖతీజా వాళ్లమ్మ మెట్లమీదినుండి కిందపడింది. నడుం విరిగి లేవలేకుండా మంచంలో పడిఉందని, చివరిసారిగా ఓసారి కూతుర్ని చూడాలంటోందనీ చెప్పింది. ఖతీజాకు దుఃఖం ఆగలేదు. "నీ కూతురెప్పుడో చచ్చిపోయిందని చెప్పు ఏసమ్మా" అంటూ లోపలికి వెళ్లిపోయింది.

ఖతీజా తల్లి నడుము ఒకింత కుదుటపడింది. రెండు నెలల తర్వాత ఆసుపత్రి నుండి ఇంటికి తీసుకెళ్లారు. కూతుర్ని చూడనిదే తాను చనిపోనని ఆమె భీష్మించింది! అలాగే అయింది.

ఈసారి నీళ్లుపోసుకున్నప్పుడు ఆమెకు ఒంట్లో శక్తిలేదు. తినడానికి మంచి తిండిలేదు. ఖతీజ పెద్దకూతురిని స్కూల్లో వేశారు. ఎలాగైనా తన కూతురు చదువుకుని పైకిరావాలని ఆమె తాపత్రయం. ఎంత చేతగాకపోయినా ఆమెకు వంటిల్లు వదిలే పరిస్థితి లేదు.

ఓరోజు ఆమె భర్త పైకి ఉబికొచ్చిన పొట్టను చూసి కళ్లు మెరిపిస్తూ "నేను హజ్‌కు వెళ్తున్నాను" అన్నాడు. ఆ మాట వినగానే ఆమె చేతిలోని కూరగిన్నె ఢబీలుమని కిందపడింది. "ఏమైంది నీకు? చిన్న గిన్నె పట్టుకోలేకపోతున్నావ్" గొంతు పెంచి అరిచాడు భర్త. ఆయేషాకూడా కోపంగా విసుక్కుంది.

మరునాడు... "నాకు నెలలు నిండుకున్నాయి. పురుడు పోసుకోవడానికి ఎక్కువ సమయంలేదు. మీరు మక్కాకు మరోసారి పోవచ్చు కదా ఆలోచించండి" అని వీలయినంత వినయంగా భర్తకు నివేదించుకుంది ఖతీజా. "ఏయ్ ఏం మాట్లాడుతున్నావ్?" అని అతను అసహనం ప్రదర్శించాడు. "అరె - రెండు మూడేళ్లుగా నేను ప్రయత్నిస్తున్నాను. ఇప్పుడేదో అల్లా దయవల్ల అవకాశం వచ్చింది. అయినా నీకు అల్లామీద భయంభక్తీ లేకుండా పోయాయ్. నన్ను ఆపాలనుకుంటున్నావ్ కదా?" అని మరో నిమిషం తర్వాత నెమ్మదించాడు. "నీ గురించి కూడా ప్రార్థిస్తాలే" అన్నాడు.

"పోనీ మా అమ్మావాళ్ళింటికైనా వెళ్లనా?" అంది. భయంభయంగా. ఇకనైనా అతను తన పట్టింపు సడలిస్తాడేమోననే ఆశతో.

మరోసారి మెరుపు మెరిసి ఉరుము ఉరిమినట్టు "ఏయ్" అని కేకపెట్టాడతను. "ఏం మాట్లాడుతున్నావే... నువ్వు? కూతురుకు భాగం ఇవ్వని తల్లి ఓ తల్లా? దాన్నింకా మరిచిపోకుండా ఉన్నావే... ఖబడ్దార్... మళ్లీ నీ వాళ్ల ప్రసక్తి నా దగ్గర తెస్తే బాగుండదు. అయినా నీకు బుద్ధిలేదు. ఇంకా ఏం ముఖం పెట్టుకుని మీ వాళ్ల దగ్గరికి వెళతావ్?" ఆమె కిమ్మనలేదు.

ఉరుము తర్వాత పిడుగు పడింది. "నేను మక్కాకు పోగానే నువ్వు నీ తల్లి దగ్గరికి వెళదామనుకుంటున్నావేమో... అదేమీ కుదరదు. అంతే! ఇది నా ఆర్డర్. దీనికి తిరుగులేదు" అన్నాడు మరింత కోపంగా. గుండెలోకి మరో కత్తి దిగినట్లయింది.

ఈసారి నొప్పి వెనుకవైపునుండి మొదలైంది. శరీరం రెండు ముక్కలైపోతుందన్నట్లు అనిపించింది. ఇక అదే చివరి నొప్పేమో అనుకుంది. మంత్రసాని శిశువును బయటికి తీయడానికి సిద్ధపడింది కూడా. కానీ ఖతీజా ప్రసవించలేకపోయింది. జీవితాంతం అనుభవిస్తూ వచ్చిన బాధను, ప్రసవవేదనను అన్నింటినీ దిగమింగి "ఇక ఈ శిశువు పుట్టదు" అనుకుంది. తను జీవిత చరమాంకానికి చేరుకున్నట్లు భావించింది. తన కూతురిని చూడాలనుందని మంత్రసానికి చెప్పింది. ఆ గొంతులో జీవం లేదు. మంత్రసాని సుమయ్యను పిలుచుకొచ్చింది.

"సుమయ్యా! ఇలారా" అని దగ్గరికి పిలిచింది. ఒక్కొక్కమాట పలకడానికి ఆమె ఎంతో శ్రమించాల్సి వచ్చింది. ఖతీజా తన ఉబ్బిన కళ్లతో పదేళ్ల కూతురు సుమయ్యాను ఒకసారి తనివితీరా చూసుకుంది. ప్రేమగా చూపులతోనే స్పృశించింది.

"అమ్మీజాన్ ఎందుకు పిలిచావ్?" అంది సుమయ్య అమాయకంగా తల్లికి దగ్గరగా వచ్చి కూతుర్ని గట్టిగా పట్టుకుంది.

"సుమయ్యా! నేనీ నొప్పులింక భరించలేను. మరోబిడ్డకు జన్మనివ్వలేను. నా పని అయిపోయింది. రేపు మా అమ్మ, అన్నయ్యలు... అంటే నీకు అమ్మమ్మ, మావయ్యలు తప్పక వస్తారు. నా శవాన్ని చూడడానికైనా వస్తారు. వాళ్లతో నువ్వు వెళ్లిపో... ఇక్కడ ఉండమని ఎవరైనా చెప్పినా వినకు. బాగా చదువుకుని నీ కాళ్ల మీద నువ్వు నిలబడు" ఆ మాటలు చెబుతున్నప్పుడు ఖతీజా కన్నీళ్లు ఆపుకోలేకపోయింది. సుమయ్యా తల్లి కన్నీళ్లు చూడలేక తన చిట్టి చేతులతో తుడిచింది.

"సుమయ్యా! నా నుండి జన్మించలేనిదేదో.. నీ నుండైనా జన్మించనీయమ్మా!" అంది ఖతీజా బాధగా...ఆశగా...



సలహాలు

వీరాలాపాలు చేస్తూ ఓవరైపోయి,
ఫుల్లుగా మందు కొట్టేసిన చిదంబరం,
ఇంటికెళ్లే టైమ్‌కి గొల్లుమన్నాడు "మా యావిడ
తలుపు తీయదోయ్. తీసినా ఇప్పటివరకూ ఎక్కడ
తగలడ్డావని పీకట్టు కుంటుంది"

ఆ రాత్రికి తోటి మందుబాబు లెవరి ఇంట్లోనైనా ఆశ్రయం పొందాలని చిదంబరం ప్లాన్.

కానీ, "మందు కొట్టేవాడు ముందుగా పెళ్ళానికి చెప్పాల్సిన సాకులు నేర్చుకోవాలని తెలియని బతుకేమిటోయ్ నీది?' అంటూ ఒకడు మందలించాడు.

మరొకడు "దొంగలా ఇంట్లో దూరే విద్య నాకొచ్చు. నేర్పనా?" అన్నాడు.

"వీడిదంతా దొంగబతుకు. నాలా సెకండ్ సెటప్ పెట్టుకోవాలోయ్. ఇలాంటి ఆపత్సమయాల్లో భేషుగ్గా పనికొచ్చేదదే!" మూడోవాడి సలహా.

శ్రీకృష్ణ వరప్రసాద్

అలా చేద్దాం

అతను ప్రేయసిని అడిగాడు "నీకు ప్రేమించి పెళ్ళి చేసుకోవటం ఇష్టమా? పెళ్లాడి ప్రేమించటం ఇష్టమా?"

"ఏది ముందు వెనుకలైనా ఫర్లేదు. అయినా మనమెలాగూ ప్రేమించుకున్నాం. పెళ్లి చేసుకుంటాం కదా! తర్వాత కూడా వదలకుండా ప్రేమించుకుంటూనే వుందాం" అందామె.

"నాకైతే ప్రేమించి పెళ్లి చేసుకోవటం ఇష్టం. ఇప్పటి వరకూ మనం ప్రేమించుకున్నాం గనక, ఇప్పుడిహ గుడ్‌బై చెప్పుకుని చెరొకర్నీ పెళ్ళాడేద్దాం" అన్నాడా బాటకపు ప్రియుడు.





ఓ మంచి పుస్తకం

కలం చిత్రాలు

వకుళాభరణం రామకృష్ణ

(కొండ అద్దమందు కొంచెమై ఉండదా ప్రసంగ తరంగిణి - రాపాక ఏకాంబరాచార్యులు హైదరాబాద్, 2006, రూ : 30/-)

ఆంధ్రుల చరిత్రపై, భాషాసంస్కృతులపై లోతైన చర్యలు కొంతకాలంగా కొనసాగుతున్నాయి. ముఖ్యంగా దక్షిణాది, ద్రావిడ కుటుంబాల్లోని భాషల్లో ఏదెంత ప్రాచీనత కలిగి ఉన్నదనే అంశంపై వాదోపవాదాలూ ఉన్నాయి. వీటిని నిగ్గుతేల్చి, నిర్ణయించడానికి మనకు లభ్యమయ్యే చారిత్రక ఆధారాలను అనుసరించాలి. చరిత్రకు సంబంధించి ఖచ్చితమైన ఆధారాలు లేనిదే ఏ అంశాన్ని గూర్చి ఇతమిద్ధంగా చెప్పడానికి వీల్లేదు. ఈ ఆధారాలు ముఖ్యంగా పురావస్తు శాసనాలు, నాణేలనుండి లభిస్తాయి. ఎప్పుడో చరిత్ర గర్భంలో కనుమరుగయిన వీటిని వెలికి తీసి, రుజువులతో నిర్ధారించి గతాన్ని నిర్మించాల్సి ఉంటుంది. ఇది కత్తిమీద సాములాంటిది. ఇందులో చరిత్రకారుల ఆత్మాశ్రయభావాలకు చోటుండరాదు. ఇది చరిత్ర రచనకు సంబంధించిన ప్రధాన సూత్రం.

ఇక చరిత్ర రచన గావించే చరిత్రకారులున్నారు. వారు చరిత్రను ఏ విధంగా రాశారు? చరిత్ర రచనాప్రక్రియను గూర్చిన చరిత్ర చాలా ఆసక్తిదాయకమైన అంశం. అందరు చరిత్రకారులూ అన్ని కాలాల్లోనూ ఒకటిగా ఉండరు. ఒకే విధంగానూ రాయరు. మారుతున్న సమాజంలోని ఆర్థిక, సామాజిక వ్యవస్థల కారణంగా వృద్ధిచెందే భావజాలం చరిత్ర రచనాసిద్ధాంతాలను ప్రభావితం చేస్తుంది.

ప్రస్తుతం సమీక్షిస్తున్న గ్రంథం, ఆంధ్రుల చరిత్ర రచనకు ఎనలేని కృషిచేసిన తొలితరం చరిత్రకారుల జీవిత చిత్రణలకు సంబంధించింది. 'చారిత్రకులే దేశానికి ప్రగతి సాధకులు. మార్గదర్శకులు. గతాన్ని రాబోయే దానితో అనుసంధించే సేతువులు వారు' ఈ వాక్యాలు గ్రంథరచయిత రాపాక ఏకాంబరాచార్యులు ఒకానొక సందర్భంలో రాసినవి. ఇదే విషయాన్ని ప్రజల చరిత్రకారుడు ఇ.హెచ్.కార్ 'గతానికి, వర్తమానానికి నిరంతరం జరిగే సంభాషణ'గా చరిత్రను పేర్కొన్నాడు. గతంలేనిదే వర్తమానం లేదు. ఈ రెండిటి ఆధారంతో భవిష్యత్తును రూపొందిస్తారు. ఆంధ్రుల చరిత్రను సుసంపన్నం చేసిన చరిత్రకారుల సంక్షిప్తజీవితాలు ఈ గ్రంథంలో ఉన్నాయి. విజ్ఞానాభివృద్ధితో పాటు, చరిత్ర రచనకు సాధికారికంగా శ్రీకారం చుట్టిన విజ్ఞానచంద్రికా గ్రంథమండలి స్థాపించిన కొమర్రాజు వెంకట లక్ష్మణరావు మొదలుకొని చిలుగూరి వీరభద్రరావు, మల్లంపల్లి సోమశేఖరశర్మ, పుట్టపర్తి శ్రీనివాసాచార్యులు, సురవరం ప్రతాపరెడ్డి, నీలకంఠశాస్త్రి, రావిప్రోలు సుబ్రహ్మణ్యం, ఇంకా మరెందరో ఇందులో కలంచిత్రాల (pen potraits) రూపంలో కన్పిస్తారు. ఇంకా పేరెన్నికగన్న పత్రికాసంపాదకులు, అవధానద్వయం తిరుపతి వెంకటకవులు, రామకృష్ణ పరమహంస మొదలైన 18మంది మహాపురుషుల జీవిత చిత్రణలు ఇందులో చోటుచేసుకున్నాయి.

ఒకటో, రెండో మినహాయించి ఇవన్నీ ఆచార్యులుగారు ఆకాశవాణిలో చేసిన ప్రసంగాలు. అందువల్ల వీటి విస్తృతి, పరిధి పరిమితమైనప్పటికీ విషయ వివరణలో జీవిత విశేషాలను గుదిగుచ్చి పొందుపరచడంలో అనన్యప్రజ్ఞను ప్రదర్శించారు రచయిత. ఆంధ్రుల చరిత్ర, భారతదేశ చరిత్రలో అంతర్భాగంగా అతి ప్రాచీనమైంది. దీన్ని గ్రంథస్తం చేయడం దాదాపు వంద సంవత్సరాల క్రితం ఆరంభమైంది. ఆంధ్రుల చరిత్ర రచన తొలిదశలో కాలికి బలపం కట్టుకుని ఊరూ వాడా తిరిగారు. శాసనాలు, నాణేలు, స్థానిక చరిత్రల శకలాలు సేకరించి తమ జీవితాలనే చరిత్రకు ధారపోసిన వైతాళికులు వీరు. కేవలం వారి జీవిత విశేషాలతో సరిపుచ్చలేదు. వీరి రచనల్లోని విభిన్నాంశాలకు సంబంధించిన ధన, రుణాంశాలను వివరించారు. తద్వారా ఆంధ్రులచరిత్ర స్థూలరూపం అంతర్లీనంగా మనకు సాక్షాత్కరిస్తుంది. అదొక్కటే కాదు ఇందులోని వారందరూ బహుముఖ ప్రజ్ఞావంతులు కావడం ఈ గ్రంథ వైశిష్ట్యం. కేవలం చరిత్రకారులో, సాహిత్యకారులో, పత్రికా సంపాదకులో కాదు. ఈ ప్రతిభలన్నింటినీ తమలో పొదువుకున్న ప్రతిభామూర్తులు వారు. అప్పటివాళ్ళ ప్రత్యేకత అదే! ఉదాహరణకు మల్లంపల్లి, కొమర్రాజు, సురవరం, పుట్టపర్తిలాంటి వారు అటు చరిత్రనూ, ఇటు సాహిత్యాన్నీ ఔపోసన పట్టిన తొలితరం వేగుచుక్కలు.

ఈ గ్రంథం రాసేందుకు రచయితకు అన్ని అర్హతలూ ఉన్నాయి. చరిత్రను క్షుణ్ణంగా అధ్యయనం చేయడంతోపాటు రచన, బోధనా ప్రక్రియల్లో లబ్ధప్రతిష్టులు. వీరి రచనలు విషయ సంపన్నతతో పాటు సరళమైన శైలిలో చదివించే గుణాన్ని కలిగిఉంటాయి. చరిత్రకారుల రచనలనుండి కొన్ని భాగాలు ప్రకటించడం వారి శైలీవిన్యాసాన్ని తెలుపుతుంది. వీరింకా విశేషంగా రాసి ఆంధ్రుల చరిత్రను సంపన్నం చేయాలని ఆశిద్దాం.





మనసా... తెలుసా?

కౌన్సెలింగ్ సైకాలజిస్ట్,
పర్సనాలిటీ
డెవలప్‌మెంట్ ట్రైనర్,
ఫోన్ :
9849130141

హిప్నో కమలాకర్

నేను డిగ్రీ చదువుతున్నాను. నాకు రెండు సంవత్సరాల క్రితం ఒకబ్బాయితో పరిచయమైంది. చివరికి అతనంటే ఇష్టంగా మారింది. అతనికి వివాహమైందని నాకు ఈమధ్యనే తెలిసింది. అయినా నేను అతనిపై గల ప్రేమను చంపుకోలేకపోతున్నాను. నా చదువుపై శ్రద్ధ చూపలేకపోతున్నాను. అతన్నే పెళ్ళి చేసుకొని అతనితో కలిసి జీవించాలనుకుంటున్నాను. నా ఆలోచన సరైనదేనా చెప్పగలరు.

– రాధిక, ఒంగోలు

నీదింకా చదువుకునే వయసే. ముందు నీ డిగ్రీ పూర్తి చేయి. స్నేహాలు ఈ కాలంలో అబ్బాయిలు, అమ్మాయిల మధ్య చాలా సహజం. అయితే నీలా ఆ స్నేహాన్ని ప్రేమగా భావించేది చాలావరకు అమ్మాయిలే. నువ్వు అతనంటే ఇష్టపడ్డావు సరే... అతను కూడా నిన్ను ఇష్టపడ్డాడా? ఒకవేళ ఇష్టపడితే నిన్ను రెండో భార్యగా అతను స్వీకరించగలడా? అతను అలాచేసిన ఆనక నీకు సమాజంలో అతని రెండో భార్యగా లభించే గౌరవం ఏమిటి? అనేది ఆలోచించావా? పైగా అతను తనకు పెళ్ళయిన సంగతి ఈమధ్యనే చెప్పాడంటున్నావు. దీంతోనే అతనెంత నిజాయితీపరుడో అర్థమవుతోంది. అయినా నువ్వింకా చదువుతున్నావు. నీ చదువు పూర్తి చేసుకుని ఏదో ఒక మంచి ఉద్యోగం చూసుకొని ఆ తర్వాత నీ మనసుకు నచ్చిన వ్యక్తిని ప్రేమించి, అతని ఇష్టాయిష్టాలు నీకు నచ్చాక అప్పుడు పెళ్ళి గురించి ఆలోచించుదువుగాని.

నా వయసు 18 సంవత్సరాలు. నేను పదో తరగతి చదివే రోజుల్లో ఒక ఇంట్లో అద్దెకుండేవాళ్ళం. మా ఇంటి ఎదురుగా ఉన్న అబ్బాయి పెళ్ళికి వాళ్ల బంధువులబ్బాయి ఒకతను వచ్చాడు. అతను నన్ను తొలిచూపులోనే ప్రేమించాడు. నా కోసం నాలుగు నెలలు మా ఊళ్లోనే ఉన్నాడు. అతనంటే నాకూ ఇష్టమే. నాన్నకు భయపడి బయటపెట్టలేదు. నేను ప్రేమించటం లేదని అతను విషం తాగేశాడు. అయితే ప్రాణహాని జరగలేదు. ఆ తర్వాత మా వూరు విడిచివెళ్ళిపోయాడు. కానీ నన్ను మర్చిపోలేదని, నాపై గల ప్రేమ తగ్గలేదని తెలిసి నేను కూడా అతన్ని అమితంగా ఇష్టపడ్డాను. అప్పట్నుంచీ తరచుగా కలుసుకునేవాళ్ళం. వాళ్ళ కులం, మా కులం ఒకటి కాదు. పైగా వాళ్ళింట్లో వాళ్ళ బలవంతంమీద అత్తకూతుర్ని పెళ్ళి చేసుకున్నాడు. నేను నా ఆలోచనలంటినీ అతని చుట్టూనే అల్లుకున్నాను. నా ప్రేమను చంపుకోలేకపోతున్నాను. అతనే భర్త కావాలని కోరుకుంటున్నాను. నన్ను ఏం చేయమంటారు?

– శ్రావణి, నెల్లూరు.

కేవలం 18 సంవత్సరాల వయసులో మీరు ఇంతగా ప్రేమ గురించి ఆలోచించటం, అతనే మీ భవిష్యత్తు అని వాపోవటం చాలా విచిత్రంగా ఉంది. మీరింకా మానసికంగా ఎదగాలి. మీరు ప్రేమ గురించి, పెళ్ళిళ్ళ గురించి అంత పరిపక్వంగా ఆలోచించటం లేదు. ప్రేమకి పెళ్ళి ఒక్కటే పరమావధి కాదు. పైగా అతను మీతోనే జీవితం అంటూ మరొక పెళ్ళి చేసుకోవటం అతని ప్రేమను శంకించేలా చేస్తోంది. అంతలా నిన్ను ప్రేమించానన్నవాడు, నీకోసం విషం తాగినవాడు, రోజూ నీతో మాట్లాడేవాడు, నీకు తెలియకుండానే పెళ్ళి చేసుకుని... ఆ తర్వాత కూడా నీకు చెప్పలేదంటే అతనెలాంటివాడో తెలియటం లేదా? కాబట్టి ముందు చదువుపై నీ దృష్టి కేంద్రీకరించు. నీ కాళ్ళమీద నువ్వు నిలబడే ప్రయత్నం చేయి. ఏదైనా కళలలో ఆరితేరి నీకంటూ ఒక స్థానాన్ని సంపాదించు. ముందు ముందు పైకి రాగలవు.

నేనొక అబ్బాయిని ప్రేమించాను. అతను ఇక్కడి వాడు కాదు. వాళ్ళది వేరే రాష్ట్రం. నాతో చాలా సన్నిహితంగా ఉంటాడు. అయితే భాష వేరు కావటంతో ఇద్దరిమధ్యా కమ్యూనికేషన్ కష్టంగా ఉంటోంది. అతను నన్ను ప్రేమిస్తున్నాడా లేదా అన్నది తెలుసుకోలేకపోతున్నాను. ఎలా అడగాలో తెలియటం లేదు. అడిగితే ఎలాంటి స్పందన వస్తుందోనని భయంగా ఉంది. నేనేం చేస్తే బాగుంటుందో చెప్పండి.

– స్పందన, ఒంగోలు

మీ ఇరువురి మధ్య కమ్యూనికేషన్ లోపం ఉందని చెబుతున్నావు. అతని స్నేహాన్ని నువ్వు ప్రేమలా ఎందుకు అనుకున్నావో నాకు అర్థం కావటం లేదు. ముందు మీ స్నేహాన్ని చక్కగా కొనసాగించు. ఇద్దరి మధ్యా భాష సమస్య ఉంది. దాన్ని అధిగమించడానికి ప్రయత్నించు. ఆ తర్వాత ఒకరి భావాలు ఒకరికి అర్థం అయిన తర్వాత అప్పుడు ఇష్టాయిష్టాల గురించి ఆలోచించవచ్చు. ఒకవేళ ఇప్పుడే నీ ప్రేమ సంగతి బయటపెడితే అతను గనుక కాదంటే ఇటు స్నేహం చెడుతుంది. అటు నీ బాధపడుతుంది. కాబట్టి తొందరపడకుండా ముందు స్నేహాన్ని పటిష్టంగా మలచుకో. ఆ తర్వాత మీ ఇద్దరి పరస్పర అవగాహనతో నీ ప్రేమ వ్యవహారం గురించి మాట్లాడుకోవచ్చు.

సమస్యలకు ఆహ్వానం

మీకు లేదా మీవాళ్ళకు మానసికమైన సమస్యలేమైనా తలెత్తాయా? ఏం చేయ పాలుపోక సతమతమవుతున్నారా? అయితే వెంటనే ఆ సమస్యేంటో మాకు తెలియజేయండి. సైకాలజిస్ట్ శ్రీ హిప్నోకమలాకర్ తగిన పరిష్కారాన్ని తెలియజేస్తారు.

మా చిరునామా: ప్రజాశక్తి ఆదివారం అనుబంధం, స్ట్రీట్ నెంబర్: 1, అశోక్ నగర్, హైదరాబాద్ - 500 020.

విజ్ఞాన వీచిక

ఎస్. వెంకట్రావు

శాస్త్ర-సాంకేతిక పరిశోధనపై సామాజిక నియంత్రణ ఉండొద్దా!?



ఇండియా, ఇరాన్, ఉత్తర కొరియా వంటి దేశాల అణు పరిశోధనా కార్యకలాపాలపై అంతర్జాతీయ అదుపాజ్ఞలు ఉండాలంటోంది అమెరికా. దాదాపు అన్ని దేశాలూ అదే కోరుకుంటున్నాయి. అందుకే అంతర్జాతీయ అణు ఇంధన సంస్థను కూడా నెలకొల్పాయి. వివిధ దేశాల్లోని ప్రభుత్వాల ఆధ్వర్యంలో జరుగుతున్న అణు పరిశోధనా కార్యకలాపాలపై ఓ కన్నేసి ఉంచడం, ఆయా దేశాలు శాంతియుత కార్యకలాపాలకు అంటే అణు విద్యుత్తుకోసం కాకుండా అణుబాంబులు ఇతర మారణాయుధాలు తయారుచేయడానికి అణుఇంధనాన్ని ఉపయోగించకుండా చూడ్డం ఈ సంస్థ పని. అయితే ఈ సంస్థ అమెరికా ఇతర అణ్వస్త్రదేశాలపట్ల ఒకరకంగానూ, ఇతర దేశాలపట్ల మరోరకంగానూ వివక్షతతో వ్యవహరిస్తోంది గనుక దీనిచుట్టూ అనేక వివాదాలు నడుస్తున్నాయి, అది వేరే విషయం.

అణు శక్తి మానవజాతికి ఎంత ఉపయోగవో, దుర్వినియోగం చేస్తే అంత ప్రమాదకరం గనుక దాన్ని ప్రభుత్వాల అదుపులోనే కాదు, అంతర్జాతీయ అదుపులో ఉంచాలని పట్టుబడుతున్నారు. అంతవరకు సమంజసమే. అయితే అణుశక్తి వలే అత్యంత ప్రమాదరకమై ఇతర శాస్త్ర-సాంకేతిక పరిశోధనల సంగతేంటి అని ప్రశ్నిస్తున్నారు ప్రపంచంలోని అనేకమంది సామాజిక శాస్త్రవేత్తలూ, నిపుణులూ, మేధావులూ. ఉదాహరణకు, జన్యు పరిశోధనలు. జన్యుమార్పిడి ద్వారా అనేక రకాలైన కొత్త జీవలక్షణాలు సృష్టిస్తున్నారు. జీవ లక్షణాలకు కారణమైన జన్యువులపై పరిశోధన చేయడమంటే మనం కోరుకునే జీవుల్లో మనకు అనుకూలమైన మార్పులతోబాటు, ప్రతికూలమైన మార్పులు కూడా తీసుకురావచ్చు. జన్యుమార్పిడి మొక్కలూ, జంతువులూ, ముఖ్యంగా సూక్ష్మజీవులూ అదుపుతప్పితే మానవాళికి పెద్ద ప్రమాదం ముంచుకొస్తుంది. ఈ విషయంలో ఇటీవల జన్యుమార్పిడిద్వారా తయారైన బిటి పత్తి విత్తనాలూ, కొన్ని రకాల మొక్కజొన్న విత్తనాలూ సృష్టించిన వివాదం మనకు తెలుసు. జన్యుమార్పిడి మొక్కల్లోని పుప్పొడి ఇతర మొక్కలపై పడితే వాటిలో ఎటువంటి మార్పులొస్తాయో మనం ముందుగా ఊహించలేం. మన రాష్ట్రంలోనే ఇటీవల బిటి విత్తనాలతో మొలకెత్తిన మొక్కలుతిని మేకలు, గొర్రెలు మరణించిన సంగతి మనకు తెలుసు. నిజానికి జన్యుమార్పిడి ప్రక్రియ అనేది అణుఇంధన ప్రక్రియ మాదిరిగానే 'గొలుసుకట్టు' ప్రక్రియ. అంటే ఒకసారి కీ ఇచ్చి వదిలేస్తే దానంతటదే పనిచేసుకుపోయే యంత్రం లాంటిదన్నమాట. అణు విచ్ఛేదన గొలుసుకట్టు చర్య మానవుని అదుపులో జరిగితే విడుదలయ్యే శక్తి అణు విద్యుత్తుగా మారుతోంది. అలాగాక అణువిచ్ఛిన్నంపై అదుపులేకుంటే అది విస్ఫోటన రూపం తీసుకుంటుంది. అదే అణుబాంబు. అణు పరిశోధనల్లో ఉండే ఈ ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకునే దీన్ని ప్రభుత్వ అదుపులోనూ, అంతర్జాతీయ పర్యవేక్షణలోనూ ఉంచుతున్నారు. మరి అలాంటప్పుడు అంతే ప్రమాదకరమైన అంశాలు ఇమిడి ఉన్న జన్యు పరిశోధనను ప్రభుత్వ అదుపులో పెట్టకపోతే ఎలా? కానా ఇప్పుడు జన్యు పరిశోధన ఎక్కువ భాగం ప్రైవేటు కార్పొరేట్ రంగంలో సాగుతోంది.

జన్యు పరిశోధనతోపాటు ఇంకా చాలా రంగాలను ప్రభుత్వ లేక సామాజిక నియంత్రణ కిందకు తేవాల్సి ఉంటుంది. ఉదాహరణకు కొత్తగా అభివృద్ధి అవుతోన్న 'సూక్ష్మ సాంకేతికవరిజ్ఞానం' (నానోటెక్నాలజీ). 'స్మాల్ ఈజ్ బ్యూటిఫుల్' అని ముప్పయ్యేళ్ల క్రితం ఆర్థికవేత్త షూమేకర్ రాశాడు. అంటే 'చిన్నదే అంతరమైంది' అని. కాని ఇప్పుడు మాత్రం నానోటెక్నాలజీ గురించి తెలిసినవారు 'స్మాల్ ఈజ్ ఆల్సో డేంజరస్' అంటున్నారు. అంటే చిన్నది ముద్దుగా ఉండడమే కాదు ప్రమాదకరంగా కూడా ఉంటుందని. మనిషి వెంట్రుకమొనలో పదివేల వంతు పరిమాణం ఉండే సూక్ష్మ పరికరాలు, సూక్ష్మ కంప్యూటర్లూ తయారుకాబోతున్న తరుణంలో ఈ పరికరాలు, కంప్యూటర్లు కలిగించే ప్రయోజనంతోబాటు వాటి పై సామాజిక అదుపులేకుంటే అవి సృష్టించే ప్రమాదాలూ అంతకంటే ఎక్కువగానే ఉంటాయి. ఈ రంగంలో కూడా ప్రభుత్వాల కన్నా ప్రైవేటు బహుళజాతి కార్పొరేట్ కంపెనీల అదుపాజ్ఞలే ఎక్కువగా ఉండడం ఆందోళన కలిగించే విషయం.

జీవశాస్త్ర పరిశోధనల్లో క్లోనింగ్, పిండకణాలపై పరిశోధనలూ, బయో ఇంజినీరింగ్ పరిశోధనలూ, నానోటెక్నాలజీ పరిశోధనలూ, అణు పరిశోధనలూ, అంతరిక్ష పరిశోధనలూ, జన్యు పరిశోధనలూ, సూక్ష్మజీవ పరిశోధనలూ.... ఇవన్నీ కూడా సామాజిక అదుపాజ్ఞల్లో జరిగితేనే మానవాళికి గరిష్టంగా ఉపయోగపడతాయి, ప్రమాదరహితంగా ఉంటాయి. ప్రైవేటు పరిశోధనల తీరుగాని, వాటి ఫలితాలను ఉపయోగించుకునే తీరుగాని ప్రజల సమిష్టి ప్రయోజనం కన్నా వ్యక్తి, లేక కొద్దిమంది వ్యక్తుల ప్రయోజనాలకు పెద్ద పీట వేస్తాయి. ప్రైవేటు పరిశోధన దిశ ప్రజలకు ఏం కావాలన్నవైపు కాకుండా పోటీ ప్రపంచంలో ఎలా నెగ్గుకురావాలి, లాభాలెలా పెంచుకోవాలి అన్న దిశలోనే ఉంటుంది. శాస్త్ర పరిశోధనారంగంలో ఈ ప్రైవేటు తత్వం అనేక అనర్థాలకు దారితీస్తోంది. అందుకే ఈనాడు ప్రపంచంలో బట్టతలలపై జుట్టు మొలిపించడానికి జరుగుతున్న పరిశోధనల్లో పదోవంతు కూడా మలేరియా వ్యాధి నిర్మూలనపై జరగడంలేదు. ఇది ఎవరో చెప్పిన విషయం కాదు. కొత్త సాంకేతిక వరిజ్ఞానంపై ఐక్యరాజ్య సమితి విడుదలచేసిన పత్రం ఈ విషయం పేర్కొంది. 1990-1998 మధ్య శాస్త్ర-సాంకేతిక పరిశోధనపై ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు చేసే ఖర్చు యథాతథంగా ఉండగా ప్రైవేటు ఖర్చు మాత్రం 25శాతం పెరిగి 50,000కోట్ల డాలర్లకు (సుమారు 22,50,000కోట్ల రూపాయలకు) పెరిగిందని అదే పత్రం తెలిపింది. వ్యవసాయరంగంలో ఇది మరింత కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఈ రంగంలో ప్రభుత్వాల ఖర్చు తగ్గిపోతోంది. మోన్‌శాంటో వంటి ప్రైవేటు బహుళజాతి కంపెనీలు చేసే ఖర్చు పెరిగిపోతోంది. ప్రపంచంలో పేదరికం, ఆకలి నిర్మూలించేందుకు కంకణం కట్టుకున్న అంతర్జాతీయ వ్యవసాయ పరిశోధనాసంస్థల నెట్‌వర్క్ మొత్తంగా ఏడాదికి 40కోట్ల డాలర్లు ఖర్చు చేస్తుండగా ప్రైవేటు కంపెనీలన్నీ కలిసి 1000 కోట్ల డాలర్లు ఖర్చు చేస్తున్నాయి.

శాస్త్ర-సాంకేతిక పరిశోధన ప్రైవేటు వ్యక్తులు, సంస్థల చేతుల్లోకి పోవడంవల్ల రెండురకాల నష్టాలున్నాయి. ఒకటి, ఇక్కడ పరిశోధనలు ప్రజల అవసరాలకోసం కాకుండా మార్కెట్‌కోసం జరుగుతాయి. అందువల్ల విస్తారమైన పేద, సామాన్య ప్రజలకు దీనివల్ల నష్టం జరుగుతుంది. ఇక రెండవది, ఈ పరిశోధనా ఫలాలను ప్రైవేటు వ్యక్తులు తమ స్వార్థ ప్రయోజనాలకోసం వినియోగించుకునే అవకాశం ఏర్పడ్తుంది. ఈ రెండు ప్రమాదాల దృష్ట్యానే శాస్త్ర-సాంకేతిక పరిశోధనలపై సామాజిక అదుపాజ్ఞలు ఉండాల్సిన విషయమై పెద్ద ఉద్యమం లేవాల్సిన అవసరం ఉంది. లేకుంటే మానవాళికి ఉపయోగపడాల్సిన సాంకేతికాభివృద్ధి విషసర్పమై దాన్నే కాటేసే ప్రమాదం ఉంది. తస్మాత్ జాగ్రత్త! ♣

కొత్త పుస్తకాలు

బాల్యాన్ని తట్టిన 'చేయిచాచిన వెన్నెల'



పసిపిల్లల హృదయాల్ని తడమడమంటే తమ గతకాలానికి సంబంధించిన దృశ్యాన్ని పోగేసుకోవడమే. ప్రతివ్యక్తి జీవితంలో తొంగిచూసే ఒకానొక భావవక్తీకరణాచిత్రమే బాల్యం. కొందరికది మండుతున్నకొలిమి. తడారిన గొంతుకు చిధ్రమైన చిత్రం. మరికొందరికది మరువలేని తీపిజ్ఞాపకం. అమ్మ ఒడి, కమ్మని లాలిపాట ఈ రెండు పార్శ్వాల్లోని అంతరాన్ని ఆవిష్కరించడమంటే అంత సులువైంది కాదు. ఆ మధుర జ్ఞాపకాలను మమకారంతో పెనవేసుకున్నట్లు చెప్పడం బహుశా వై శ్రీరాములు సాధించిన ఒక విజయమని చెప్పొచ్చు. సాహితీలోకానికి సుపరిచితుడైన శ్రీరాములు ఈమధ్య 'చేయిచాచిన వెన్నెల' బాల్యంపై దీర్ఘకవితను ప్రచురించాడు. అది పాఠకులను ఆకర్షించడమే కాకుండా హత్తుకునేలా చేసింది. నగ్నముని అన్నట్లు 'నిజానికి భారతదేశంలో బాల్యంలేదు. డాలర్‌బేబీలు చదువుల ఫ్యాక్టరీలో యంత్రాలు... వీళ్లలో ఎంతమంది చందమామని చూశారో అనుమానమే' ఈ మాటల్ని చదువుతుంటే పేగులు మెలిపెడ్తున్న వికారమేదో కలగకమానదు.

చేయిచాచిన వెన్నెల, వై. శ్రీరాములు
వెల 50/-, పేజీలు78,
ప్రతులకు: విశాలాంధ్ర, ప్రజాశక్తి, నవోదయ అన్ని బ్రాంచీలు

పుట్టగానే ఎగుమతుల ఏజెన్సీలకు అమ్మబడుతున్న బాల్యాన్ని కవి ఆర్ద్రంగా ఆవిష్కరించి పాఠకుల గుండెల్లోకి నేరుగా ప్రవేశిస్తాడు. వీధి సర్కస్‌లో ఆకలినియామకమేస్తూ అని చెప్పడంలో బాల్యం కొందరికి కష్టాల్ని ఈడ్చుకొచ్చే భారమైన వెతుకులాట కన్పిస్తుంది. బాల్యాన్ని ప్రతీకారంగా చెప్పడంలో కవి కలం ఆగినట్లుగా ఎక్కడా కనిపించదు. సామాజిక యదార్థ జీవితాల్ని అంతేస్పష్టంగా, నిజాయితీగా ప్రకటించిన శ్రీరాములు నాలుగు కాలాలు సజీవంగా మనగలిగే కవిత్వాన్ని పాఠకలోకానికి అందించడం అభినందనీయం. 'ఉదయించే దిశలోనే అస్తమిస్తున్న సూర్యుడు', 'ఒకే ఒక తేజో వెన్నెల ఈ బాల్యం', 'ఆనందాన్ని అందరితో పంచుకోవడమే బాల్యం', 'నిజానికి నిర్వచనం బాల్యం' అంటూ పాఠకుని మనసును తట్టిలేపిన కవి శ్రీరాములు. బాల్యంపై దీర్ఘకవితను మొదటినుండి చివరి వరకు ఒకే టెంపోతో నడిపిన తీరు పాఠకులను కట్టిపడేస్తుంది. దీర్ఘకవితకు కావాల్సిన అంత:సూత్రాన్ని, ఏకసంభావనను పాటించిన 'చేయిచాచిన వెన్నెల' అందరికీ చెందుతుందేమో. పాఠకుడు ఆప్యాయంగా చేయిచాచడం ఖాయం. మరి శ్రీరాములు మరో వెన్నెలను అందిస్తారేమో చూద్దాం.

- సైదులు



వెయ్యినూట పదహార్లు
ఉత్తమ మినీ కవితల సంకలనం
డా॥ రావి రంగారావు
వెల:116/-, పేజీలు:216
ప్రతులకు :
రావి రంగారావు,
ఎ.జె. కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్
మచిలీపట్నం - 521 001

కిలికించితాలు
కె. బాలకృష్ణారెడ్డి
వెల: 25/-
పేజీలు: 72
ప్రతులకు :
కె. బాలకృష్ణా రెడ్డి,
ఎఫ్ 6, సత్యపార్వతి అపార్ట్‌మెంట్స్,
ఒంగోలు.



అనగనగా చెదిరిన ఓ కల...

సమాజంతో పాటుగా వ్యక్తుల జీవనాన్ని చిత్రించిన ఒకానొక ప్రయోగాత్మక నవల శ్రీరామకవచం సాగర్ వెలువరించి 'మూలుగు'. ఈ నవలలోని ప్రతి అక్షరంలోనూ సాగర్ తనదైన ముద్రేసుకున్నాడు. ఎక్కడా తొట్రుపాటు కన్పించదు. ఒకానొక కల అనంతర సమాజ వాతావరణాన్ని చిత్రించినట్లున్న ఈ నవల 'దావూద్' అనే పాత్ర చెప్పుకొస్తున్నట్లుగా నడుస్తుంది.

నవల్లో కన్పించే కథ నిగూఢంగానూ, అర్థంకాని పరిభాష్యంలోనూ ఉన్నట్లుగా శిల్పం ఎన్నుకున్నారు. ఇది సామాన్య పాఠకుణ్ణి అయోమయంలోకి నెడుతుంది. కాకపోతే పాఠకుడు కాస్త కష్టపడి రచయితలోకి దూరే ఓపిక చేస్తేమట్టుకు ఇక ఆసక్తికరంగా చదువుతాడనడంలో సందేహం లేదు.

ఈ నవలలో కన్పించే ప్రధాన పాత్ర దావూద్. తనకు 'బొల్లి'(చర్మవ్యాధి) ఎక్కువవుతోందని, భార్య, పెంపుడు కుమార్తెలతో కలిసి ఎడ్లబండిలో ప్రయాణం సాగిస్తాడు. దావూద్ కమ్యూనిస్టు కార్యకర్త. భారత్‌నుండి పాకిస్తాన్ విడిపోవాలనే వాదనను బలపరిచే వ్యక్తి. ఇదేమిషతో పార్టీ అతన్ని బహిష్కరిస్తుంది. ఆ సంగతి మార్గమధ్యంలో తోటి కామ్రేడ్‌ద్వారా తెలుసుకుంటాడు దావూద్. అయినా తన ప్రయాణాన్ని కొనసాగిస్తోన్న క్రమంలో అనేకానేక పదభిన్నాలు, ప్రతీకారాత్మక పాత్రలు ప్రవేశిస్తాయి. ఆ పాత్రల చిత్తవృత్తులు మరింత విచిత్రంగా కనిపిస్తాయి. జేమ్స్‌బాండ్ నవల్లోని దృశ్యాల్లా ఆకాశానికి ఎగరడాలు, మెరుపువేగాలతో పరుగుతీయడాలు ఉంటాయి. చివరికి కల చెదిరిన సమయాన శిథిల గృహంలో (ఈ స్థలం నవలకు మూలం) ఫిట్స్‌తో పడిపోయి ఏం జరుగుతోందో తెలియని స్థితికి చేరతాడు.

మూలుగు, శ్రీరామకవచం సాగర్,
వెల: 40 /-, పేజీలు : 132
ప్రతులకు: విశాలాంధ్ర, ప్రజాశక్తి, నవోదయ అన్ని బ్రాంచీలు

ఈ నవల అమెరికా సామ్రాజ్యవాదకాంక్షను, అరాచకత్వాన్ని, బానిసలుగా మారే మనుషుల మనస్తత్వాన్ని కళ్లకు కట్టినట్లు చిత్రించింది. కొందరి మిత్రుల ఎడబాటుకు దూరమైన వ్యక్తి తిరిగి గుర్తింపు పొందడానికి ప్రయత్నిస్తాడు. తప్పుచేసిన లేక చేస్తున్నారనుకునే మిత్రులకు అర్థమయ్యేట్లు చెప్పిన పాత్ర లక్ష్యం నెరవేరితే ఈ నవలాలక్ష్యమూ నెరవేరినట్లే. రచయితలకే అర్థమయ్యే ఓ రచయిత స్వగతం ఇది. తనను దూరం చేసుకున్న మిత్రులకు మాత్రమే ఏదైనా చెప్పాలి. ఇతరులకు అర్థంకాని విధంగా రాయాలనుకున్నవారు చదవాల్సిన పుస్తకమిది. అప్పుడిది అందరి మూలుగు అవుతుందని ఆశిద్దాం.

- వేము

కావలసిన పదార్థాలు

మెంతికూర : 3 కట్టలు
శనగపిండి : 250 గ్రాములు,
పచ్చిమిర్చి, ఉల్లిపాయలు, ఉప్పు, అల్లం తగినంత

తయారు చేసే పద్ధతి

మెంతికూర కోసి బాగా కడిగి తడి ఆరబెట్టి తర్వాత శనగపిండిలో వేసి కలపాలి. పచ్చిమిర్చి, అల్లం మెత్తగా నూరి అందులో కలపాలి. తరిగిన ఉల్లిపాయ ముక్కలు, ఉప్పు కలిపి ముద్ద కింద చెయ్యాలి. వడల్లా తయారు చేసి నూనెలో వేయించాలి.

మెంతి వడ

రుచి

మెంతి పరోటా

కావలసిన పదార్థాలు

మెంతికూర : ఆరు కట్టలు
గోధుమపిండి : పావుకిలో
నెయ్యి : ఒక కప్పు
కారం : ఒక స్పూన్

తయారు చేసే పద్ధతి

మెంతికూర కోసి శుభ్రంగా కడిగి ఆరబెట్టాలి. దీనిని సన్నగా తరుక్కుని కొంచెం ఉప్పు, కారం కలపాలి. గోధుమపిండిలో ఉప్పు కలిపి నానబెట్టి ముద్దగా చెయ్యాలి. అప్పడాల పీట మీద పూరీలలాగా తయారుచేసి ఉంచుకోవాలి. చేసిన పూరీమీద మెంతికూర పరచి పైన మరో పూరి పెట్టి అంచులు నొక్కితే అంటుకుపోతుంది. తర్వాత అప్పడాల కర్రతో మెత్తగా వత్తుకోవాలి. పెనంమీద నెయ్యి లేదా నూనె వేసి పరోటా రెండు వైపులా దోరగా వేయించాలి.



అవ్వ అత్యాశ

చూటీ

ఒక ఊళ్లో ఓ అవ్వ, తాతయ్య వుండేవారు. తాతయ్య మంచివాడు. ఎవరైనా బాధల్లో వుంటే అస్సలు తట్టుకోలేకపోయేవాడు. వెంటనే తనకు చేతనైన సాయం చేసేవాడు. ఆయన భార్యకు అంటే.. అవ్వకు దురాశ ఎక్కువ. తన చేత్తో ఎప్పుడూ ఎవరికీ ఏమీ ఇవ్వదు. పైగా తాత సాయం చేస్తుంటే వెనుక నుంచి సణుగుతుంటుంది. అయినా తాత అవేం పట్టించుకునేవాడు కాదు. తన మనసు చెప్పినట్టు నడుచుకునేవాడు.

❀ ❀ ❀

ఎప్పటిలాగే ఆరోజు కూడా తాతయ్య పొలం పనికి వెళ్లాడు. అక్కడ పొలం దున్నాడు. పిచ్చి మొక్కలు పీకేశాడు. ఆ తర్వాత కట్టెల కోసం అడవిలోకి వెళ్లాడు. బాగా లోపలికి వెళ్లి ఎండిపోయిన చెట్లను వెతికి మరీ కట్టెలు కొట్టసాగాడు. సరిగ్గా అప్పుడు ఓ పిచ్చుక ఏడుపు వినిపించింది. కిందకి చూస్తే... ఓ పిచ్చుకపిల్ల నేల మీద పడివుంది. దాని కాలికి బాగా గాయమై రక్తం కారుతోంది. పిచ్చుకను అలా చూసిన తాతకు జాలేసింది. వెంటనే చెట్టు దిగి కిందకి వచ్చి "ఓ చిన్నారి పిచ్చుకా! ఏమైంది నీకు? ఓ... కాలికి దెబ్బ తగిలిందా! ఇంక బాధపడకు. నిన్ను చూసుకోడానికి నేనున్నాగా. నీకు వెంటనే నయమౌతుంది. ఎంచక్కా ఇదివరలోలా ఎగురుకుంటూ మీవాళ్ల దగ్గరకు వెళతావు. సరేనా! పద మా ఇంటికి వెళదాం" అంటూ కట్టెల మోపు నెత్తిమీద పెట్టుకుని చేత్తో పిచ్చుకను పట్టుకుని ఇంటి దారిపట్టాడు.

ఇల్లు చేరగానే... కట్టెలమోపు కింద పడేశాడు. ఒక శుభ్రమైన గుడ్డ తీసుకుని దాని కాలికి అంటిన మట్టి, రక్తం తుడిచాడు. తర్వాత కట్టు కట్టి... తినడానికి కాసిని బియ్యపు గింజలు పెట్టాడు. అవ్వ మంచంలో కూర్చుని ఇదంతా చూస్తూనే వుంది. ఆమెకు తాత వరుస నచ్చలేదు. దాంతో కోపం వచ్చింది. "ఆ బోడి పిచ్చుక కోసం బియ్యం ఎందుకు వృధా చేస్తావు?" అనడిగింది. తాతయ్య అదేం పట్టించుకోకుండా పిచ్చుకకు సేవలు చేయడంలో మునిగిపోయాడు.

❀ ❀ ❀

తర్వాత ఓరోజు తాతయ్య... "పిచ్చుక జాగ్రత్త సుమా! దానికి వేళకు గింజలు అవీ పెడుతుండు. అసలే అది గాయంతో బాధపడుతోంది..." అవ్వకు జాగ్రత్తలు చెప్పి మరీ పొలం బయలుదేరాడు. అప్పుడు మూతి మూడు వంకర్లు తిప్పతూ "నాకు ఆ మాత్రం తెలీదా. నువ్వు అంతగా చెప్పాలా" అంది అవ్వ నిష్ఠూరంగా. కానీ ఆ తర్వాత పిచ్చుక గురించి పట్టించుకోనేలేదు. దానికి తినడానికి ఏం పెట్టకుండా బట్టలు ఉతకడానికి చెరువుకెళ్లింది. దాంతో పాపం చిన్నారి పిచ్చుకకు ఆకలి పెరిగిపోయింది. ఇల్లంతా చూస్తే దానికి అవ్వ చేసిన గంజి కనిపించింది. దాన్ని చూడగానే పిచ్చుకకు ఆకలి రెట్టింపైంది. ఇంకేం ఆలోచించకుండా మెల్లగా అదంతా తినేసింది. తర్వాత కాసేపటికి అవ్వ బట్టలు ఉతుక్కుని వచ్చింది. వాటికి గంజి పెడదామని చూస్తే ఏముంది? ఖాళీ గిన్నె కనిపించింది.

నేరుగా పిచ్చుక దగ్గరకెళ్లి "చెప్పు! ఏం చేశావ్?" గద్దించింది కోపంగా. పిచ్చుక భయపడుతూ భయపడుతూ..."నన్ను క్షమించు అవ్వా! ఆకలి తట్టుకోలేక నేనే తినేశాను" అంది. అంతే... అవ్వకు బాగా కోపం వచ్చింది. "దొంగ పిచ్చుకా! నా గంజి అంతా తినేశావా! నువ్వు ఇలా మరెప్పుడూ చెయ్యకుండా వుండాలంటే నీకు నాలుక కత్తిరించాల్సిందే...' అంటూ కత్తెర తీసుకొచ్చి పిచ్చుక నాలుక కత్తిరించబోయింది. పిచ్చుక పాపం ఎలాగో తప్పించుకుని ఏడుస్తూ అడవిలోకి వెళ్లిపోయింది.

❀ ❀ ❀

ఆ తర్వాత కాసేపటికి తాతయ్య పొలం నుంచి తిరిగి వచ్చాడు. పిచ్చుక కోసం ఇల్లంతా చూశాడు. పిచ్చుక ఎక్కడా కనిపించలేదు. అవ్వనడిగాడు. ఆవిడ జరిగినదంతా చెప్పింది. అది వినగానే తాతకు నోట మాట రాలేదు. తర్వాత అవ్వ మీద బాగా కోప్పడి... పిచ్చుకను వెతుకుతూ బయలుదేరాడు.

"ఓ... నా చిన్నారి పిచ్చుకా! ఎక్కడున్నావు? ఎక్కడున్నా... వెంటనే వచ్చేసెయ్. జరిగిన దానికి నన్ను క్షమించు. నా మీద కోపం లేకపోతే నాకు కనిపించు" అంటూ అడవంతా తిరిగి వెతకసాగాడు. అలా వెళుతుండగా... వెళుతుండగా ఆయనకు మూడు పిచ్చుకలు కనిపించాయి. తన చిన్నారి పిచ్చుక గురించి వాటిని అడిగాడు తాత.

(తాతకు పిచ్చుక కనిపించిందా లేదా? ఒకవేళ కనిపించినా తాతతో అది మాట్లాడిందా? తర్వాత ఏమైంది? అన్న ప్రశ్నలకు జవాబు తెలియాలంటే వారం రోజులు ఆగాల్సిందే)

బాలల కథ